ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

అక్టోబర్ 16, 2005

Entered

మన ఆహారం

పిజ్జా... బర్గర్లా?!

హ్యాపీ బర్త్‌డే

(16.10.2005 నుంచి
22.10.2005 వరకు)

టి. వైష్ణవి
7సం॥, 16.10.1998
మునెమ్మ-రాజా
పుంగనూరు-చిత్తూరు

డి. శ్యాకేత్ వర్మ
1సం॥, 17.10.2004
జయప్రభ-శ్రీహరిరాజ్
జిందాల్‌నగర్-విజయనగరం

ఎస్. శ్రీహిత
అక్టోబర్-21
విజయ-బాబు
సూర్యాపేట-నల్లగొండ

కె. సింధుజ
3సం॥, 17.10.2002
మాధవి-రత్నాచారి
కొండపి-ప్రకాశం

సిరివెన్నెల
2సం॥, 17.10.2003
లలిత-వేణుగోపాల్
ఖానాపురం-ఖమ్మం

ఓ. శ్రావణి
1సం॥, 18.10.2004
అమరావతి-మల్లికార్జునరావు
రాజేంద్రనగర్-గుంటూరు

ఎన్. శివప్రసాద్
3సం॥, 19.10.2002
నర్సమ్మ-వెంకటేష్
ఆరుట్ల-రంగారెడ్డి

శ్రీసాయి బ్రహ్మరాజ్
అక్టోబర్-20
సుజాత-బుపేంద్రకుమార్
కనిగిరి-ప్రకాశం

సిహెచ్. వాసవి
అక్టోబర్-21
దుర్గ-పుల్లయ్య
నేలకొండపల్లి-ఖమ్మం

విన్ను
1సం॥, 20.10.2004
నయోమి-ప్రసాద్
దిండి-తూ॥గో

జి. సౌజన్య
5సం॥, 20.10.2000
పద్మ-నారాయణ
తల్లాడ-ఖమ్మం

కె. హేమచందర్
2సం॥, 20.10.2003
లక్ష్మి-సతీష్
నల్లగొండ

చిన్ను
3సం॥, 21.10.2002
మేరి-వేణుగోపాల్
విశ్వేశ్వరాయపురం-తూ॥గో

జె. శివజస్వంత్
1సం॥, 21.10.2004
శివపార్వతి-వేణు
కొండపల్లి-కృష్ణా

ఎ. ఏంజిల్
రోసి-ఆల్బర్ట్
ఉత్తుకోటయి

మీనాకుమార్
1సం॥, అక్టోబర్-2004
యాదమ్మ-వెంకటేష్‌గౌడ్
చైతన్యపురి-హైదరాబాద్

శృతి
1సం॥, అక్టోబర్-2004
ఫణింద్ర-వెంకటేశ్వర్లు

సయ్యిదా
3సం॥, అక్టోబర్-2002
షాహీదా-వారీస్
రాణా రాయచోటి

కె. జోసఫ్‌క్లా
1సం॥, అక్టోబర్-2004
పరాక్రమ్
ఒంగోలు-ప్రకాశం

జి. వి. రామన్
5సం॥, అక్టోబర్-2000
రజిత-మోహన్
వైరా-ఖమ్మం

సాయిశ్రీ-కళ్యాణ్
5సం॥, 16.10.2000
మధులత-లెనిన్
మిర్యాలగూడ-నల్లగొండ

కె. సోనిపండు
2సం॥, అక్టోబర్-2003
అనురాధ-నాగరాజు
కోదాడ-నల్లగొండ

పి. శరద్
2సం॥, అక్టోబర్-2003
రజని-రాజేష్
జారసంఘం

బాబా ఇర్షద్
3సం॥, అక్టోబర్-2002
కరిష్మాబేగం-మహబూబ్‌బాష
వీరపునాయునిపల్లె

ఈ వారం అతిథి



మన అతిథి గురించి...

పేరు	:	ఆకెపాటి విజయసాగర్ రెడ్డి (ఎ.వి.ఎస్. రెడ్డి)
వృత్తి	:	రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్
ఊరు	:	పాటూరు, కడప జిల్లా
పుట్టిన తేది	:	1944 డిసెంబర్ 27న
విద్య	:	బి.ఎ, క్వీన్ ఎలిజబెత్ హౌజ్ ఫెలో (యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్), ఫెలో రాయల్ జియోగ్రాఫికల్ సొసైటీ (లండన్)
నచ్చిన వ్యక్తి	:	నేతాజీ సుభాష్ చంద్రబోస్
నచ్చని అంశం	:	ఆత్మవంచన
హాబి	:	పెయింటింగ్, నఖ చిత్రాలు

ఓటర్లలో చైతన్యం పెరిగింది

ఎన్నికల్లో ఓటర్ల నాడి తెలుసుకోవడం రాజకీయపార్టీలకు చాలా కష్టమవుతోంది. వారిలో చైతన్యం పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రచార వ్యూహాలు, ప్రీ పోల్ సర్వేలతో నిమిత్తం లేకుండా ఓటర్ల తీర్పు వైవిధ్యంగా వెలువడుతోంది. మీడియా సైతం వారిని ప్రభావితం చేయలేదనడానికి గతంలో వెలువడిన ఫలితాలే నిదర్శనం. రాజకీయ పార్టీలు నేర చరితులను పిలిచి టిక్కెట్లు ఇస్తున్నా ఓటర్లు వారిని గట్టిగా తిరస్కరిస్తున్నారు. గత వారంలో వెలువడిన పురపాలక ఎన్నికల ఫలితాల్లోనూ ఇది నిజమైంది. రాష్ట్ర ప్రజానీకం కోరిన పాలన అందించినప్పుడల్లా ఆయా పార్టీలకు అఖండ ఆదరణ లభించింది. వారు బడుగుల సంక్షేమం కన్నా, బడాబాబుల సంక్షేమమే పరమావధి అనుకున్న సందర్భాల్లో తీర్పు అందుకు అనుగుణంగానే వెలువరిస్తూ వస్తున్నారు. ఏ పార్టీ అయినా ప్రజల మంచి చెడులను పట్టించుకుంటే వారికి నిరంతర ఆదరణ లభించడం ఖాయం. పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో వామపక్ష పార్టీలు సుదీర్ఘకాలంగా అధికారంలో కొనసాగడం వెనుక ఉన్న కారణాలను పరిశీలిస్తే ఎవరికైనా ఈ విషయం బోధపడుతుంది. తమకు కావలసిన కనీస అవసరాలు తీర్చాలని మాత్రమే ప్రజలు కోరుకుంటారు. వారి ఆలోచనలు...ఆకాంక్షలు తీర్చాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఎంతైనా ఉంటుందని గుర్తుంచుకోవాలి. రాజకీయాలపై కామెంట్ చేయడం నాకు నచ్చదు. అయినా సమకాలీన రాజకీయాలపై ప్రజలకు ఎంతో ఆసక్తి ఉంది. ప్రజలను ప్రాంతాల వారిగా, మతాల వారిగా విడగొట్టి లబ్ధిపొందాలని భావించిన వారు తాజాగా భంగపడ్డారు. భిన్న సంస్కృతులు గల ప్రజలు రాష్ట్రంలో నివసిస్తున్నారు. వారి ఆలోచనా విధానాల్లోనూ అంతే భిన్నత్వం తొణికిసలాడుతోంది. సునామీ బీభత్సం, లాతూర్ భూకంపం, దివిసీమ ఉప్పెన తదితర సందర్భాల్లో రాష్ట్ర ప్రజానీకం కుల మతాలు, భాషా బేధాలు, ప్రాంతీయతత్వాలకు అతీతంగా స్పందించారు. చేతనైన సాయం చేస్తూ చేయూత నందించారు. వారికున్న విశాల మనస్తత్వం రాజకీయ పార్టీల్లో ఏ మేరకు ఉందో ప్రజలందరికీ తెలుసు. నోరు తెరిస్తే నైతిక విలువల గురించి మాట్లాడే రాజకీయ నేతలు...విప్‌లను ధిక్కరించి కప్పగంతు లేయడాన్ని ప్రజలు మరిచిపోరని గుర్తించుకోవాలి.

ఈ సంచికలో...

టపా ... 2
నేర్చుకుందాం..రా! 3
టర్నింగ్‌పాయింట్ 4
సలహాలు ... 5
ఇలాటి సంగతులు ... 6
క్యాంపస్ చాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
మనమూ మన నమ్మకాలు... 20
ఓ ఊరి కథ ... 21

సీరియల్ 15
మాధవి

ఇంకా,,,

మనసా తెలుసా 7
తరాల అంతరాలు

పాడు బుద్ధి పాడుగాను
కథ 18

ఆరోగ్యం ... 17
పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
అవీ... ఇవీ 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

వాహ్వా...

అట్టమీది కథ 'గాంధీ పుట్టిన దేశమా...!?' లో మహాత్ముని ఆలోచనలతో పాటు ఆయన జీవిత చరిత్రను తెలుసుకున్నాం. అహింసావిధానాన్ని ఆయుధంగా మలచుకున్న మహామేధావి, నిస్వార్థ సేవలనందించిన మహాత్ముడు గాంధీజీ. ఆయనను స్మరించే వారు చాలా తక్కువయ్యారు. స్త్రీ స్వేచ్ఛకోసం ఆయన పాటుపడ్డారు. వబ్‌ల సంస్కృతి...అర్ధరాత్రి అని పాఠకుణ్ణిలో చింపజేసే ముగింపు చాలా నచ్చింది. హైటెక్కు మనిషి తత్వాన్నీ, దారుణ అకృత్యాలనూ ఆయన ఊహించుండరు. చక్కని ఫొటోలతో అందించిన కథనం వాహ్వా! నా నేస్తం స్నేహను చదవందే మనసు నిమ్మళించదు... **ఆర్. రాజావల్లి, హిమకుంట్ల, కడప**



ఎప్పుడు...

"అర్ధరాత్రి వేళ స్త్రీ స్వేచ్ఛగా సంచరించగలిగిన నాడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు" అని గాంధీజీ తన రచనల్లో అనేక చోట్ల వ్రాసిన మాట నిజమే. కానీ నేడు భాగ్యనగరంలో అర్ధరాత్రివేళ వందలాది మంది స్త్రీలు రోడ్లపై కనిపిస్తున్నారు. వీరిలో కొందరు కాంట్రాక్టు కాజువల్ కార్మికులైతే... మరికొందరు వీకెండ్ రిసార్ట్ సంస్కృతి మాయాజాలంలోని వారు. పోలీస్ లాకప్పులో హింసలు... అత్యాచారాలు... స్త్రీలపై జరుగుతున్నాయి. వీటికి తోడు పుట్టేది అమ్మాయని తెలిస్తే తెలిస్తే గర్భంలోనే వారి ఉసురు తీసేస్తున్నారు. ఇక ఆడపిల్ల అర్ధరాత్రి ఎలా తిరుగుతుంది? గాంధీజీ కోరికెప్పుడు నెరవేరుతుంది? ఇలాంటి దేశంలో పుట్టే ధైర్యం మరలా గాంధీజీకుందా?

కర్రా వరప్రసాద్, యలమర్రు కండ్రిక

మనసారా...

అట్టమీది కథ 'గాంధి పుట్టిన దేశమా' చాలా బాగుంది. భార్య కస్తూరిభా ప్రసవ వేదన సమయంలో గాంధీజీ మంత్రసానిగా వ్యవహరించి పురుడుపోసిన సంగతి తెలుసుకున్నాం. గాంధీజీ జీవితాన్ని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి.

అర్ధరాత్రి వేళ స్త్రీ స్వేచ్ఛగా తిరిగే రోజు... గాంధీజీ కలలుగన్న రోజు రావాలని మనసారా కోరుకుంటున్నాం. అలాగే 'సెన్స్ కామన్ సెన్స్' శీర్షిక వాస్తవానికి దగ్గరగా ఉంది. అందరినీ ఆకట్టుకుంటోంది. **చిప్పాడ ఉమామహేశ్వరరావు, కురుపాం**

మరిన్ని శీర్షికలు...

స్నేహ మేగజైన్ సర్వాంగ సుందరంగా ముస్తాబవుతూ... మా హృదయాలను తనవైపుకు తిప్పుకుంటోంది. విజ్ఞాన వినోదాలతో పాఠకనేస్తాలనాకట్టుకుంటోంది. రచనావ్యాసంగం సాహితీ ప్రియులనలరిస్తోంది. మరిన్ని శీర్షికలను ప్రవేశపెట్టి మమ్ములను రంజింపజేస్తారని ఆశిస్తూ...

దేవెళ్ల బస్వశంకర్, అల్లాదుర్గం, మెదక్

టెన్షన్‌తో...

ఆదివారం రాగానే పుస్తకం తీసి మాధవి సీరియల్‌ను చదవకుండా ఉండలేకపోతున్నాం. ముమ్ముందు ఏం జరుగుతుందా అన్నంత టెన్షన్‌తో ఉక్కిరిబిక్కిరవుతున్నాం. ప్రాపంచికా వగాహనకు, మానసిక వికాసానికి, విజ్ఞాన వినోదాలకు ప్రతిపేజీ అత్యుత్తమైనది. ఇంత చక్కని పత్రిక అందిస్తున్నందుకు అభినందనలు...

మైలెజి మాస్టర్, అల్లాదుర్గం

ఇంకా ఎన్నో...

'క్యాంపస్ ఛాట్' చూసి మా స్నేహితులందరమూ చాలా ఆనందించాం. పాత జ్ఞాపకాలన్నింటినీ ఇలా గుర్తుచేసుకోవడం చాలా సంతోషంగా అనిపించింది. మా అనుభవాలను పంచుకోవడానికి ఒక చక్కని అవకాశం కల్పించారు. ఇది మళ్లీమళ్లీ రాదు. ఇంకా ఎన్నో అనుభవాలను పంచుకోవాలని కోరుకుంటున్నాను. మీ స్నేహ ఇంకా అభివృద్ధిలోకి రావాలని ఆశిస్తూ...

జె. శ్రావణి, పాల్వంచ

సలక్షణంగా

స్వేచ్ఛా జ్వాలగా మారి మాతృదేశ స్వాతంత్ర్యంకోసం తన ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ అమరుడు. విటమిన్ డి ఆవశ్యకతను క్లుప్తంగా, చక్కగా వివరించారు. విజ్ఞాన వీచికలో శాస్త్రవివరణ బాగుంది. నూతనప్రసాద్ చెప్పిన పెద్దమనుషుల చరిత్ర సలక్షణంగా ఉంది. హ్యాపీ బర్త్‌డే, కలం స్నేహం శీర్షికలు సమతుల్యంగా ఉన్నాయి.

సి. వాస్తు రామచంద్ర, రాంజీ నగర్, నెల్లూరు-2

సినిమా కబుర్లు

'అశక్తుడిని కాదు నటిస్తూనే ఉంటాను...' అని అంటున్న నూతన్ ప్రసాద్ ఆత్మవిశ్వాసాన్ని 'సినిమాకబుర్లు' శీర్షిక చక్కగా వివరించింది. ఆయన మన తెలుగు కళామతల్లికి లభించిన ముద్దుబిడ్డ. ఈ వారం కార్టూన్లు వర్ధమాన ప్రపంచానికి ప్రతిబింబాలుగా నిలిచాయి. హాస్యం సంయమనంతో, సమయస్ఫూర్తితో కలగలిపి పండడం అభినందనీయం. 'ఈ వారం అతిథి' శీర్షిక పత్రికకే హైలైట్. అనేక ఉపయోగకరాంశాలతో ముచ్చటగొలిపేలా స్నేహను వెలువరుస్తున్నందుకు ధన్యవాదాలు.

నేమాన సుభాష్ చంద్రబోస్, శ్రీకాకుళం టౌన్-1

మనసా... తెలుసా?

ఏ సమస్యయినా పరిష్కరించాలంటే ముందుగా దాని ఉనికిని గుర్తించాలి. ఆ తర్వాతే పరిష్కారం సంగతి. నేటి తల్లిదండ్రులకెదురవుతున్న సమస్యావాతావరణం ఇంచుమించుగా ప్రతి ఇంటిలోనూ ఉంటున్నదే. పేద, ధనిక అన్న తేడా లేకుండా, ప్రతి ఇంటిలోనూ టీనేజీ పిల్లలొక సమస్యగానే ఉంటున్నారు.

హిప్నో కమలాకర్

కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్ : 9849130141

తరాల అంతరాలు

సమిష్టి కుటుంబాలంతరించి పోయాయి. చిన్ని కుటుంబాలెక్కువయ్యాయి. వీటిలోనూ భార్యాభర్తలిరువురూ ఉద్యోగాలకెళుతున్నారు. కొన్ని కుటుంబాలలో దంపతుల మధ్య కావలసిన ఒద్దిక లేకపోవడం, ఎడతెగని వాదోపవాదాలు, తగవులాటలు చెలరేగడం చూస్తుంటాం. ఫలితంగా విడాకులకేసులు... విడిపోతున్న దంపతులు... వీరి పిల్లలు అటు తండ్రి దగ్గరో, ఇటు తల్లి దగ్గరో పెరుగుతుంటారు. అన్నీ సవ్యంగా ఉన్నాయనుకున్న ఇళ్లలో ఆర్థికసమస్యలు! ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లల గురించి పట్టించుకోలేకపోతున్నారు. వారికోసం తగిన సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. ఫలితంగా తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఏర్పడుతోంది. పిల్లలపై పర్యవేక్షణ లేకపోవడం, ఒకవేళ ఉన్నా అది చాలా తక్కువ స్థాయిలో ఉండడంతో తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య పరస్పర ప్రతిచర్యలు లోపిస్తున్నాయి. పిల్లలకు ఆదర్శవంతమైన వ్యక్తిత్వాలు మోడల్‌గా లభించట్లేదు. వారికి ప్రవర్తనానమూనాలు కరువైపోతున్నాయి. మార్గదర్శక సూత్రాలను బోధించేవారు కరువయ్యారు. తప్పుచేస్తే అక్కున చేర్చుకుని సరిదిద్దేవాళ్లు లేరు. పిల్లల ప్రవర్తనపై పెద్దల అదుపులేకపోవడం, దీనికి తోడు పాశ్చాత్య నాగరికత ప్రభావం, సినిమాలు, సరదాగా అలవాటయ్యే వ్యసనాలు, పచ్చబొట్లు (టాటూస్) పొడిపించుకోవడం దగ్గరనుంచీ బ్రౌన్ షుగరుకు అలవాటుపడడం వరకూ పలు విపరీత పోకడలనందించే స్నేహబృందం. ఇలా చెప్పుకుపోతే టీనేజీ జీవితాన్ని ప్రభావితంచేసే అంశాలనేకం.

మునుపటి రోజులే నయం...

టీనేజీపిల్లలు ఎడ్డెమంటే తెడ్డెమంటారు. అది క్రీస్తుపూర్వంలోనైనా... నూతన సహస్రాబ్దిలోనైనా సరే. మనసొంత అనుభవాలు సైతం ఇదే సంగతిని చెబుతాయి. లోపం పాత తరానిదో, కొత్త తరానిదో కాదు. తరతరానికి మారిపోతున్న ప్రపంచానిది! మార్పెప్పుడూ స్థిరంగా ఉండే జీవితచక్రమిది. కంటికి కనిపించే అంశాలే కాదు మానవ ఆలోచనాతత్వంలో సైతం సంవత్సరాలు గడిచేకొద్దీ మార్పులొస్తానే ఉంటాయి. అప్పటికన్నా మునుపటి రోజులే మెరుగనిపిస్తాయి. ఎదురవుతున్న ఒత్తిడినే మనమెక్కువగా పరిగణిస్తుంటాం. గడిచిన కాలంలో మనం పొందిన అనుభవాల, అనుభూతుల సాంద్రత కాలక్రమంలో క్రమంగా సడలుతుంది. అందువల్ల 'అప్పటి రోజులే బెటర్' అని మనకన్పిస్తుంది. కుర్రాళ్లలో కన్పించే వ్యతిరేకత ఈనాడు కొత్తగా కన్పించడానికి కారణం... పాత రోజులలో మన ప్రవర్తన మనకు సరిగ్గా తెలియకపోవడమే. తల్లిదండ్రుల పాత్రలలోకి ప్రవేశించేసరికి, పెద్దరికం, పిల్లలను సరిదిద్దాలనే కాంక్ష, ఫలితంగా వారిలో కొంత అహం ప్రవేశిస్తుంది. నిన్నగాక మొన్న పుట్టిన పిల్లలు తర్కించడం, వాదించడం వింతగానూ, సహింపరానిదిగానూ అన్పిస్తుంది. మనకీనాడు అన్పించినట్టుగానే, మనం టీనేజీలో ఉన్నపుడు మన తల్లిదండ్రులకూ అనిపించుండొచ్చునన్న సంగతి మనకిప్పుడిపుడే అర్థమౌతుంటుంది. పిల్లలు తమ అభిప్రాయాలను బహిర్గతంగా వ్యక్తం చేయడం, తట్టుకోలేని పరిస్థితిని కల్గిస్తుంది. కాలానుగుణంగా వచ్చే మార్పు పిల్లలలో బహిర్వర్తన లక్షణాలను ఎక్కువమోతాదులో సృష్టిస్తుంది. కిందటి తరం టీనేజీపిల్లలూ తమ తల్లిదండ్రుల భావాలతో విబేధించినవారే. అయితే అది బహిర్గతంగా వ్యక్తమయ్యేది కాదు. విభేదం వ్యక్తీకరణ పద్ధతులలో మార్పు రావడమే తప్ప, విభేదమన్నది తరతరాల అంతరాల నడుమ స్పష్టంగా చోటుచేసుకునేదే. "మా రోజుల్లో మేమెప్పుడూ ఇలాలేం" అని తల్లిదండ్రులు ఫీలవడానికి కారణమిదే.

సనాతన మనోభావాలు

ఈ ప్రపంచం ఎప్పటికప్పుడు మారుతునే ఉంటుంది. తరతరాలకు మధ్య అంతరం ఏర్పడుతూనే ఉంటుంది. పూర్వతరం వారికి ప్రస్తుతతరం విపరీతంగానే కన్పిస్తుంది. ఎప్పటికప్పుడు ఈ సమాజం వెర్రితలలు వేస్తున్నట్టే అన్పిస్తుంది. తల్లి దండ్రులకు తమ పిల్లల వైఖరి కొత్తగానూ, వింతగానూ అన్పిస్తుంది. ఈ తరం పిల్లలు విపరీత పోకడలకు పోతున్నారన్పిస్తుంది. ఈ కొత్త సమాజంలో తమ మనోవైఖరులు వయసు మళ్లిన భావాలుగా తల్లిదండ్రులకు గోచరిస్తాయి. ఫలితంగా నేటితరం సనాతన ధర్మాలను స్వీకరించలేని అపరిపక్వ స్థితిలో పడిపోయిందని వారు వాపోతారు. ఈ చాదస్తంలో పడి, పలు విచలనాలకు గురౌతూ.. దారి తప్పుతున్న యువతరాన్ని సరైన మార్గంలోకి మళ్లించే కర్తవ్యానికి దూరమౌతారు.



టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

భారతదేశ చరిత్రలో ఆధునిక యుగం 18వ శతాబ్ది మధ్యభాగం నుండి ఆరంభమైందనుకుంటే... సమాజంలో ఆధునిక చైతన్యం తలెత్తడానికి దాదాపు మరో యాభైసంవత్సరాలు పట్టిందనే చెప్పొచ్చు. రాజకీయ చైతన్యానికి ముందు మెట్టుగా... సామాజిక చైతన్యం వెల్లివిరుస్తుంది. మనదేశంలో సామాజిక చైతన్యం అటు పాశ్చాత్య భావజాల ప్రభావం వల్ల, ఇటు వలసపాలనలో చోటు చేసుకున్న ఆర్థిక పరిపాలనాపర విద్యా వైజ్ఞానిక మార్పుల వల్ల తలెత్తింది.

సతి దురాచారంపై ధ్వజం

దేశ చరిత్రలోని అతి ముఖ్యమైన ఈ దశలో... రామ్మోహన్ రాయ్ 1772లో జన్మించారు. అనాటికి హిందూమతం సనాతన సాంప్రదాయ పద్ధతుల్లో మునిగిపోయింది. బహు దేవతారాధన, కర్మకాండలు, మతాల పేరుతో చోటుచేసుకున్న అనేకానేక దురాచారాలు ప్రజలను ఎల్లి పీడిస్తుండేవి. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలోని విశిష్ట ఉపనిషత్తుల సారాంశాన్ని, పాశ్చాత్య భావజాలంలోని హేతువాద మానవీయ శాస్త్ర విజ్ఞాన భావవీచికలను తనలో జీర్ణించుకున్నాడు రామ్మోహన్. ఏకేశ్వరోపాసన, మత సార్వజనీనతలను తలకెక్కించుకొన్నాడు. విగ్రహారాధనను ఖండించాడు. దేవుడొక్కడేన్నాడు. ఆ దేవుడు నిరాకారుడనీ, ఒక అతీంద్రీయ శక్తనీ, ఈ జగత్తును నడిపించేది ఆ శక్తేననీ తెలిపాడు. ఈ సిద్ధాంతాలతో బ్రహ్మసమాజాన్ని స్థాపించాడు. వేదాలను ప్రశ్నించవచ్చుననీ, వాటితో విభేదించవచ్చుననీ, అవి దైవ కల్పితాలు కావనీ ప్రకటించాడు. తద్వారా భారతీయ ఆధ్యాత్మిక చింతనలో పెనుమార్పులను కొనితెచ్చాడు. రామ్మోహన్ బహుభాషా కోవిదుడు. సకల శాస్త్రపారంగతుడు. బైబిల్ గ్రంథాన్ని హెబ్రూ భాష నుండి బెంగాలీ భాషలోకి అనువదించాడు. పత్రికలపై ఆంగ్ల ప్రభుత్వం విధించిన నిర్భంధాన్ని వ్యతిరేకించి, పత్రికా స్వాతంత్ర్యాన్నభిలషించాడు. బెంగాలీ, ఆంగ్ల పత్రికలను స్థాపించాడు. పత్రికారచనకు, దాని పెంపుదలకు కృషి చేశాడు.

బెంగాల్లో శాశ్వత శిస్తు సహకార పద్ధతి ప్రవేశపెట్టారు. ఫలితంగా అక్కడి రైతులు జమీందార్ల ఆకృత్యాలకు, ఆర్థిక దోపిడీకి గురయ్యారు. వారి శ్రేయస్సు కోసం ఆంగ్ల ప్రభుత్వానికి విజ్ఞాపనలందజేసిన తొలి రాజకీయ కార్యకర్త రాజారామ్మోహన్ రాయ్. ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడానికి తీవ్ర కృషి చేసిన పథ నిర్దేశకుడు.

ఇవన్నీ ఒక ఎత్తుకాగా, సంఘసంస్కరణల ద్వారా సమాజాన్ని ఆధునీకరించదలిచారు రామ్మోహన్ రాయ్. ఆనాడు సమాజంలో సతీసహగమనమనే అత్యంత అమానుషమైన దురాచారముండేది. బాల్యవివాహాలు, కులీన వివాహపద్ధతి (కులీనుడైన బ్రాహ్మణుడు పెళ్లికి నోచుకోలేని ఎందరో కన్యలను వివాహమాడే దురాచారం), స్త్రీ శిశువులను పుట్టగానే చంపేపద్ధతి, ఇలాగ మరెన్నో... వీటన్నింటిలో అత్యంత దారుణమైనది... సతీ దురాచారం. దీన్ని రూపుమాపడానికి రామ్మోహన్ గావించిన కృషి చిరస్మరణీయం. దీన్ని మట్టుబెట్టాలన్న ఆలోచన ఆయనకొచ్చిన తీరు అత్యంత విషాదకరమైంది. కలకత్తానగరం చుట్టు పక్కల స్మశానవాటికల్లో నిత్యం ఎందరో అభాగినులు సతీదురాచారానికి బలయ్యేవారు.

ఓ రోజు రామ్మోహన్‌ను పూర్తిగా కలిచి వేసిన ఘటన ఒకటి సంభవించింది. ఎంతో అభిమానించిన తన అన్నయ్య చనిపోతాడు. దీంతో కుటుంబం మొత్తం కుంగిపోతుంది. రామ్మోహన్ దు:ఖానికి అంతులేదు. ఇంతలో... వదినను సతిగా అలంకరించారు. వసువూకుం కుమలతో... ముత్తయిదువగా తయారుచేశారు. మరణించిన తన అన్న శవంతో పాటుగా స్మశానవాటికకు తీసుకెళ్లారు. చితి అంటించి అన్న శవాన్ని దహనానికి సిద్ధం చేస్తారు. స్పృహ లేకుండా ఆమెకు మత్తువదార్థాలను తినిపించారు. సజీవంగా ఉన్న ఆమెను మృతదేహంతోపాటు చితిపై ఉంచారు. బాధలకు తట్టుకోలేక ఆమె అరిచిన అరుపులతో ఆ ప్రదేశం మార్మోగింది. మంటల వేడికి తట్టుకోలేక వెలుపలికి రావాలని ఆమె ప్రయత్నించింది. దాన్ని సాగనివ్వకుండా పొడుగాటి వెదురుబొంగులతో ఆమెను చితిలోకి నెట్టారు. ఆమె మంటల్లో మాడి, మసైపోయేంత వరకు ఆ ప్రక్రియ కొనసాగించారు. అది చూసిన రామ్మోహన్ రాయ్ హృదయం ద్రవించింది. కన్నీరు మున్నీరుగా విలపించాడు. ఈ దురాచారాన్ని నిర్మూలించడానికి నడుంకట్టాడు. ఈ ఘటన ఆయన జీవితాన్నే మార్చివేసింది. అప్పటి గవర్నర్ విలియం బెంటింగ్‌కు దీన్ని గూర్చి నివేదించాడు. అప్పటికే ఈ సమస్యపై ప్రభుత్వం ఆలోచనలో ఉంది. సతిని నిషేధించడం హిందూ ధర్మశాస్త్రాలకు విరుద్ధమనీ, అలాచేయడం స్వదేశీయుల మత విశ్వాసాల్లో జోక్యం చేసుకోవడమేననీ, ఆ చర్య తీవ్రపరిణామాలకు దారి తీస్తుందనీ సనాతనవాదులు ఒక పిటీషన్ తయారుచేసి కొన్ని వేల సంతకాలతో ప్రభుత్వాన్ని కోరారు. దీన్ని వ్యతిరేకిస్తూ, శాస్త్రాల్లో ఈ దురాచారానికి సమ్మతించలేదని ఉటంకిస్తూ మరొక విజ్ఞాపన పత్రాన్ని రామ్మోహన్‌రాయ్ ప్రభుత్వానికి సమర్పించాడు. సతీ నిషేధానికి ప్రజామద్దతుందని హామీ ఇచ్చాడు. దాంతో గవర్నర్ జనరల్ 1829 డిసెంబర్ 4వ తేదీన సతిని నిషేధిస్తూ ఒక శాసనం చేశాడు. చట్టాన్ని వ్యతిరేకించే వారెవరైనా శిక్షార్హులన్న విషయాన్ని ప్రకటించాడు. ఆధునిక భారతదేశానికి వేగుచుక్కగా ప్రస్తుతింపబడ్డ రాజారామ్మోహన్‌రాయ్‌కు స్త్రీలోకం కలకాలం రుణపడి ఉంటుంది.



ప్రమాదమే...

నేను గ్రంథాలయ సంస్థలో పని చేస్తున్నాను. నా పై అధికారి నాతో బలవంతంగా కొన్ని కాగితాలపై సంతకం చేయించుకున్నారు. ఆ పత్రాలలో ఏముందో నాకు తెలీదు. పైగా అతను 'లా' చేశాడు. సలహా ఇవ్వండి

సురేఖ, ఏలూరు.



జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

కేసు వేయొచ్చా ?

నేను 2005 సంవత్సరంలో ఆంధ్రా యూనివర్సిటీ నిర్వహించిన లాసెట్ పరీక్ష రాశాను. ఫలితాలు 14.6.05న విడుదలయ్యాయి. ఇంటర్‌నెట్‌లో చూస్తే నా ర్యాంక్ 1313 వచ్చింది. 3-8-05 వరకు నాకు ర్యాంక్ కార్డు రాలేదు. నేను రాసింది మూడు సంవత్సరాల ఎగ్జాం. నా దగ్గర లాసెట్ 2005 హాల్ టికెట్టుంది. నేను ఆంధ్రా యూనివర్సిటీ మీద చట్టపరమైన కేసు వేయొచ్చా ? పూర్తి వివరాలు తెలుపగలరు.

పి. శిరీషారెడ్డి, పెరికసింగారం.

మీరు ఏ సందర్భాల్లో ఖాళీ కాగితాలపై సంతకాలు చేశారు. సంతకం చేశానంటూనే ఆ పత్రాలలో ఏముందో తెలీదనీ అంటున్నారు. అంటే పత్రాల్లో ఏమైనా రాసుందనే భావన వ్యక్త పరిచారు. విషయం తెలియకుండా ఖాళీ పత్రాలపై సంతకాలు నిరక్షరాస్యులు కూడా పెట్టరు. ఇలా పెట్టించుకోవడానికి 'లా' చేయాల్సిన పనిలేదు. మీరు తెల్ల కాగితాలపై సంతకాలు చేయడం చాలా పొరపాటు. ఇలా మీ సంతకం తీసుకోవడానికి కారణమేంటో అతన్నడగండి. అతనేదైనా మొరాయిస్తే పోలీసు కంప్లయింట్ చేయండి. లేదంటే దీని వల్ల ఎప్పుడైనా మీకు ప్రమాదమే మరి.

మీరు కేసు వేసే తీవ్ర ఆలోచన చేయడం సబబు కాదు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ ద్వారా ఆలస్యమై ఉండొచ్చు కదా. అడ్మిషన్లెప్పుడు నిర్వహిస్తారో తెలుసుకొని యూనివర్సిటీ ఉన్నతాధికారులను కలిస్తే సరిపోతుంది. అప్పటికీ సరైన సమాచారం రాకపోతే డూప్లికేట్ కాపీ కోసం అప్లై చేయండి. కాలేజీలో ప్రవేశం పొందండి. ఒకవేళ నిజంగా వారి సేవల్లో లోపముంటే దానికి కారణం యూనివర్సిటీనా, పోస్టల్ డిపార్ట్‌మెంటా? నిర్ధారించుకొని, జిల్లా కన్స్యూమర్ ఫోరంలో కేసు దాఖలు చేయాల్సి ఉంటుంది.

సంతాన లక్ష్మి

ఆరుగురు పిల్లలు, సామానుతో ఆర్టీసి బస్సు ఎక్కడానికి నానా యాతన పడుతోంది సంతాన లక్ష్మి అది చూసి కండక్టర్ "కొంతమందిని ఇంటి దగ్గరే వదిలేసి రావచ్చుగా" అన్నాడు.

"మిగిలిన నలుగుర్నీ నువ్వు చెప్పిన చోటే ఉంచొచ్చా నాయనా " అంది సంతాన లక్ష్మి ఆయాసపడుతూ

-పెండెం జగదీశ్వర్

మన ఇంట్లో ఉన్న ఇలాంటి పరికరాల గురించి కనీస పరిజ్ఞానం మనకుండాలి. వేలకువేలు పోసి వాటిని తెచ్చుకుని ఇంట్లో పెట్టుకోగానే సరిపోదు. అది పనిచేసే విధానం, చిన్నచిన్న రిపేర్లు తెలిసుండడం చాలా అవసరం.

సొంత మెకానిజం

రుక్మిణి

"మనిషన్నాక కుసింత కళాపోసన ఉండకపోతే, ఆడికీ గొడ్డుకీ తేడా ఏంటసలు?"

ఈ డైలాగు తెలుగు సినీగోయర్స్‌లో చాలా పాపులర్! అది వాస్తవం!

మా అక్కయ్య కొడుకు చాలా పెద్ద మెకానిక్కు. అదో రకం కళాకారుడన్నమాట! వాడికెంతా... నిండా పద్నాలుగేళ్ళు. తొమ్మిదో క్లాసు. టెక్నికల్ బ్రెయిన్! అందుకే వాడు ఇంట్లోకడుగు పెడుతున్నాడంటే చాలు మేమంతా హడలిపోతాం. ఇంట్లో ఉన్నంతసేపూ వాడినే గమనిస్తుంటాం. వాడు అవలీలగా గోడ గడియారాన్ని (మంచిగా నడుస్తుంటుంది) తీసి.. ఏ పార్టుకాపార్టు ఊడబీకి అవతల పడేస్తాడు. పెన్నులూ...ఆటవస్తువులూ.. వాచీలు...ఏవీ వాడినుంచి తప్పుకోలేవు. అది వాడికి చిన్నతనాన్నే అబ్బిన 'విద్య'. పైగా మా అక్కయ్య 'వాడు ముందు ముందు ఇంజనీరౌతాడు' అని రాగం తీయబోతే, నాకు ఒళ్ళుమండి "మంచిగా ఉన్నవాటిని పీకిపోగులు పెట్టడం ఇంజనీరింగ్ కాదు- కంగాళీరింగు" అని రుసరుసలాడాను.

"బాబ్బాబు...పుణ్యముంటుంది... వాటి మీద చేయి చేసుకోకు...నీకు సిన్మాకు డబ్బులిస్తాగా..." అని కూడా నేను బతిమాలుతాను.

"కాదే పిన్నీ... మీ ఫ్రిజ్ నడిచేప్పుడు సన్నగా చప్పుడొస్తుందిగా... మరి దీన్ని..." అంటుంటాడా వాడు, నేను గాబరాపడి పోతాను.

"అయితే ఏం చేస్తావురా గాడిదా? పీకి పోగులు పెడతావా... చెవులు పగిలేలా రైలింజను చప్పుడొచ్చేట్లు చేస్తావా... నన్నిలా ఉండనీ... నీ ప్రతాపం అక్కర్లేదు...నీకే చెప్పేది"

అప్పటికీ వాడు వినడు. మా అక్కయ్య రెండు చరిచింతర్వాత గానీ వాడి సాంకేతిక శక్తి కసి చల్లారదు. ఇట్లా కనబడ్డ వాటినల్లా పీకి చీల్చి చెండాడి పారేయడం కొందరి హాబీ... మనకు ప్రాణ సంకటం!

ఈ రోజు మన జీవన విధానంలో 'యంత్రాల'దే పై చేయి. యంత్ర పరికరాలు అందరి ఇళ్లలోకి కుప్పలుతెప్పలుగా వచ్చి పడుతున్నాయి. టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, ఐరన్ బాక్సు, విసిడి, కంప్యూటరు ఇంకా అనేకం! వీటన్నిటినీ బోలెడంత డబ్బుపోసి కొనుక్కుంటాం! ఇంట్లో పదిలంగా అమర్చుకుంటాం... ఉపయోగించుకుంటాం. ఫలితంగా మనకు కావలసినంత విరామం... హాయి! వీటన్నింటి వెనకా ఓ సంగతుంటుంది. అదే స్టేటస్!? ఇది చాలా లోతైన విషయం. దీని జోలికిప్పుడు వెళ్లకపోవడమే మంచిది. సరే...హాయిగా కూర్చుని... వేడివేడి పకోడీలు నములుతూ... టీవీ చూస్తున్నాం! సీరియల్ మహత్తరంగా సాగుతోంది. ఇంతలో ఒక్కసారిగా టీవీ ఆగిపోయింది. అంతే... ఆటో... మెకానిక్...! అది తిరిగి 'పూర్వజన్మ' ఎత్తిందాకా మనం అల్లాడిపోతాం. ఈలోపుగా మా అక్కయ్య కొడుకు గానీ చూసి వాడు టీవీపై చెయ్యిచేసుకోబోయాడంటే మరింత టెన్షను! సరే... టీవీ మెకానిక్ వచ్చి దాన్ని శల్యపరీక్ష చేస్తాడు. నట్టులు, బోల్టులు ఊడబీకుతాడు. పెదవి విరుస్తాడు. మనం కంపరమెత్తి గజగజ లాడిపోతాం. టీవీ పనిచేస్తుందో లేదో అని అలల్లాడిపోతాం. అతడికీ 'కాజు' అర్థంగాక చెమట్లు పట్టిపోయి 'ఉస్సురని' గాలి వదుల్తాడు. మనం ఊపిరి బిగబట్టి చూస్తాం! తర్వాత అతను 'మంచి మెకానిక్' అయితే బొళబొళ నవ్వి "ఏంలేదు మేడం...! దీని ప్లగ్‌పిన్‌లో కనెక్షను వైరు ఊడింది. ఊరికే కంగారు పడిపోయారు...సింపిల్...ఇదిగో తీసుకుపోండి. అయినా ఇలాంటి చిన్న చిన్న టెక్నికల్ ఫాల్టులు సరిచేసుకోవడానికి చిన్న మెకానిజం... తెలిసుండడం చాలా మంచిది" లాంటి సూచనలతో ఓ చిన్న పాఠం చెప్పేస్తాడు. మా వాడు రెడీగా ఉంటాడు. "నేజెప్తే వినరు సార్...మా ఇంట్లో" అంటూ ఒకరకమైన ఫోజు కొడతాడు.



మావాడిలా కాదుగానీ... మన ఇంట్లో ఉన్న ఇలాంటి పరికరాల గురించి కనీస పరిజ్ఞానం మనకుండాలి. వేలకువేలు పోసి వాటిని తెచ్చుకుని ఇంట్లో పెట్టుకోగానే సరిపోదు. అది పనిచేసే విధానం, చిన్నచిన్న రిపేర్లు తెలిసుండడం చాలా అవసరం. దీని వల్ల టెన్షన్ తగ్గుతుంది.

ప్రతి సాంకేతిక పరికరమూ అది పనిచేసే విధానం.... మనం ఆచారించాల్సినవీ... చేయగలిగినవీ వాటిని కొంటున్నప్పుడే వివరంగా మనకిస్తారు. దాంతో బాటు వారంటీ కూడా! వీటిని జాగ్రత్తగా చదివితే ఇలాంటి సమస్యలను మనమే పరిష్కరించుకోవచ్చు. సరే వస్తువు అన్నాక దానికి రిపేరులు తప్పవు. సాధ్యమైనంత వరకూ దాన్ని ఆథరైజ్‌డ్ మెకానిక్‌ల దగ్గరికి పట్టుకుపోవడం మంచిది. తప్పనిసరైతే మనం మెకానిక్ పనితనం, అతని నిజాయితీ కాస్తంత వాకబు చేయడం చాలా అవసరం.

✿

నేర్చుకుందాం...రా!

గాగ్రా ఛోళీలకు మరిన్ని అందాలు

అగస్త్యరాజు లక్ష్మి సూర్యకళ

ఫోన్ : 040-55889954

"సాహితీ... తొందరగా బయలుదేరవే" అంటే అది తొందరగా కాదుగదా...అసలు తయారవ్వనేలేదు. మూతి ముడుచుక్కూర్చుంది. ఆవతల టైముకి పెళ్లి దగ్గరకు చేరుకోవాలని అందరూ సిద్ధమయిపోయి చాలా సేపయింది. సాహితి మాత్రం ఎందుకో రెడీ అవ్వడం లేదు. దానికి దాని మేనత్త అంటే చాలా ఇష్టం.

ఆవిడ అడిగితే చెప్పింది. తనకు నచ్చిన డ్రస్సే లేదని. కొత్తది కొనిపెట్టమని నిన్న చెప్పిందిట. కొనివ్వలేదని దాని ఏడుపు, అలక. దానికి ఇష్టమైన జీన్స్, చుడీదార్ అన్నీ తొడిగేసిందిట...వాటిమీద ఇష్టమే లేదుట. ఇంకేదన్నా వెరైటీగా ఉన్న డ్రస్ కావాలని అని దాని అలక. సాహితి మేనత్త అంతకు ముందు పెయింటేసి పెట్టిన గాగ్రాఛోళీని బీరువాలోంచి తీసింది.

"ఇదిగో ఇదేసుకుని చాలా రోజులైంది. అదీకాక అందరూ మోడ్రన్ డ్రస్‌పేరిట రకరకాలుగా వేసుకొస్తారు. ఎవరికీ ఈ గాగ్రాఛోళీ వేసుకురావాలని ఐడియా రాదు. అప్పుడు అందరిలోకి నీ డ్రస్సే వెరైటీగా ఉంటుంది. అదీకాక నీకిష్టమైన అత్తమ్మను కదా...నేను పెయింట్ వేసిపెట్టిన డ్రస్సుకూడా వేసుకోవా" అని తనుకూడా ముద్దుముద్దుగా అనేటప్పటికి వెంటనే గాగ్రాఛోళీ వేసుకుని బయలుదేరింది. అత్తమ్మ చెప్పినట్లు అందరిలోకి తను, తన డ్రస్సే వెరైటీగా ఉంది.



నేటి తరం పిల్లలు ఎంత ట్రెండీగా, మారుతున్న కాలాన్ని బట్టి మోడ్రన్ దుస్తులు జీన్స్, స్కర్ట్స్ ధరిస్తున్నా మన భారతీయ సాంప్రదాయ దుస్తుల్లో ఒకటైన గాగ్రా ఛోళీలను వివిధ సందర్భాల్లో ధరించటానికి మక్కువ చూపిస్తున్నారు.

పిల్లలకు రెడీమేడ్‌గా కొన్నవి సరిగా సూటైనవి దొరక్కపోవచ్చు. దొరికినా మనకు నచ్చిన డిజైన్స్‌లోనో, రేంజిలోనో దొరక్కపోవచ్చు. అంతా మాత్రానికే డీలా పడిపోనక్కర్లేదు.

క్లాత్ దగ్గరనించి, స్టిచ్చింగ్, మోడల్ దానిపైన మనకు కావలసిన డిజైన్‌ను మనకు తగ్గ బడ్జెట్‌లోనే తయారు చేసుకోవచ్చు.

ఈ మధ్య మార్కెట్లో దొరుకుతున్న మాలాయ్‌సిల్క్‌తో గాగ్రా ఛోళీ కుట్టించి దానికి స్ట్రాబెర్రీస్ లేదా ద్రాక్ష గుత్తుల్లో, పూలు లేదా మన అభిరుచికి తగిన డిజైన్స్‌ని పెయింట్ చేసుకుంటే గాగ్రా ఛోళీ సర్వాంగ సుందరంగా ముస్తాబైనట్లే. ఇంకదాన్ని మనం పిల్లలకు తొడిగి పార్టీకి వెళ్లడమే తరువాయి. ప్రక్కనున్న ఫొటోలో అందంగా పేయింట్ చేసిన స్ట్రాబెర్రీలు నిజమైన ఫ్రూట్స్‌లాగానే ఎంత అందంగా ఉన్నాయో కదా! టాప్‌కి నెక్ చుట్టూ చిన్న చిన్న స్ట్రాబెర్రీలు, చున్నీకి రెండు వైపులా అదే డిజైన్ చూడ ముచ్చటగా ఉన్నాయి కదూ!

వీలైనంత వరకూ పెయింటింగ్ చేసుకోవాలనుకుంటే లైట్ కలర్ క్లాత్‌ని ఎంచుకుంటే డిజైన్స్ అందంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తాయి.

*

తెలుగులో చెప్పండి ?

టీచర్ : మీ వాడు ఇంగ్లీష్‌లో చాలా వీకండి

తండ్రి : అలాగా ! మరి తెలుగులో ఎలా ఉన్నాడు చెప్పండి

టీచర్ : అయ్యా మీ కుమారుడు ఆంగ్ల భాషనందు చాలా బలహీనముగా ఉన్నాడు.

- పెండెం జగదీశ్వం

సీరియల్

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

గతవారం కథలో...

మిగిలిన ఆరొందల గుర్రాల కోసం మాధవిని హర్యశ్వుడి వద్దనుండి వేరే రాజ్యానికి తీసుకుని బయలుదేరాడు. పచ్చిబాలింతరాలైన మాధవి ఆ అడవుల్లో నడవలేక శోషవచ్చి పడిపోతే ధారుణీ ఋషి ఆశ్రమానికి తీసుకెళ్లాడు. ఋషి భార్య వేదవతి తిట్టినా తను చేస్తున్న దాన్ని గురించి వీసమెత్తు యోచించని గాలవుడు మాధవిని కాశీరాజు దివోదాసు వద్దకు తీసుకెళ్లాడు.

(15వ భాగం)

కాశీరాజు దివోదాసు, మంత్రి, సేనాపతి సభామందిరంలో సమావేశమయ్యారు. వాళ్లిద్దరితో ఎంతో ఆత్మీయంగా వ్యవహరిస్తాడు రాజు.

"చూసొచ్చారా రాజా, ఏర్పాట్లెలా ఉన్నాయి?" అనడిగాడు మంత్రి.

"మీరు చేసిన పని వంక పెట్టేట్లు ఉంటుందా? భేషుగ్గా ఉన్నాయి. మనవాళ్లేగాక సామంతరాజులు, చుట్టుపక్కల గ్రామాలనుండి వచ్చే జనం అందరూ సరిపోయేంత విశాలంగా నిర్మించారు. వాళ్ళందరికీ భోజనవసతి ఏర్పాటు చేయడంలో కూడా ఇబ్బందేం ఉండదనే అనుకుంటున్నాను."

"ఉండదు రాజా, మీరు నిశ్చింతగా వుండండి"

"భరద్వాజులవారు చెప్పింది గుర్తుంది కదా, ఎందులోనూ తేడా రాకూడదని నొక్కి చెప్పారు. సరిగ్గా చేయలేమనుకుంటే అసలు మొదలుపెట్టనే వద్దన్నారు" అని దివోదాసు గుర్తుచేస్తోంటే ఆయన పెదవి కాస్త వణికింది.

తేడా రాకుండా చూసే పూచీ మాది. ఎందులోనూ ఎలాంటి లోటూ రాకుండా చూస్తాం. అశ్వమేథం, పుత్రకామేష్టి కూడా నిర్విఘ్నంగా పూర్తవుతాయి మీరల్లా పుట్టబోయే కొడుకు గురించి కలలు కంటూ సంతోషంగా ఉండండి" అన్నాడు సేనాపతి.

ఆ మాటతో దివోదాసు పెదవులు విచ్చుకున్నాయి.

ఇంతలో ఒక భటుడొచ్చి "ప్రభువులవారికి నమస్కారం. ఎవరో గాలవముని అట, మీ దర్శనంకోసం వచ్చారు" అని చెప్పగా లోనికి పంపమని సైగచేశాడు.

'ముని ఎవరయ్యుంటారు?! భరద్వాజమహర్షి పంపలేదు కదా' అని ఆలోచిస్తున్నంతలో గాలవుడు మాధవితో కలసి లోనికొచ్చాడు.

గాలవుడు తన గురుదక్షిణ గురించి క్లుప్తంగా చెప్పి, "ఈమె మాధవి, చంద్రవంశపు రాజు యయాతి మహారాజుగారి కుమార్తె. ఆయన నాకు దానం చేశారు. మాధవిని ఎవరైనా మహారాజుకు అర్పించి అటువంటి నల్లటిచెవి వున్న తెల్ల గుర్రాలను పొందమన్నారు. చక్రవర్తి కాగల కొడుకును కనగల శుభాంగి మాధవి అంటే. అందులో ఏమాత్రం అతిశయోక్తి లేదు" అంటూ రెండుముక్కల్లో చెప్పదలచిందంతా ఏకరువుపెట్టాడు.

మాధవికిదంతా హేయంగా వుంది. తానేమైనా వేశ్యననుకుంటున్నాడా ఈ పిలక బ్రాహ్మడు అని కోపమొచ్చినా వారించలేని నిస్సహాయతతో మౌనంగా తలెత్తి దివోదాసువంక చూసింది. రాజసూచకమైన ఆభరణాలు సరేసరి. పొడుగ్గా, ఆరోగ్యంగా వున్నాడు. కళ్లతో నవ్వడంలో ఆరితేరినట్లున్నాడు.

'తాను కన్య కాదు, తనకో కొడుకు కూడా ఉన్నాడని చెప్తే సరి... అప్పుడు రాజు ఈ గాలవుణ్ని మెడపట్టుకు గెంటి తగిన శాస్తి చేయడూ?! తనక్కూడా ఈ యంనతో



"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిది వందలు నాకు గురుదక్షిణగా కావాలి" అన్న గురువు గారి కోరికను ఆ శిష్యుడెలా తీర్చాడో ఈ సీరియల్‌లో చదువుతున్నారు.

గడపాల్సిన అగత్యం తప్పుతుంది. తాను తిరిగి కొడుకు దగ్గరికి వెళ్ళగలుగుతుంది' అనుకుంది. కానీ మరుక్షణం అది జరిగేపని కాదనిపించింది. 'ఈ రాజేం ఏకపత్నీవ్రతుడా? వందమందితో రమించేవారికి అటువంటి పట్టింపులేం ఉంటాయిలే? ఒక అందమైన స్త్రీ దొరికితే చాలు ఆమెతో గడపాలనే ఆరాటమే తప్ప పూర్వాపరాలు వాళ్ళకెందుకు? ఇంత దురదృష్టవంతురాలైన తనకీ అందమెందుకిచ్చాడో ఆ భగవంతుడు? ఈ క్షణం గడిస్తే చాలు అనుకుంటారు. పైపెచ్చు కొడుకుల్లేరు కనుక ఎవరివల్లనైనా సరే కొడుకు కలిగితే చాలనుకుంటారు. అందునా జిత్తులమారి గాలవుడు 'చక్రవర్తయ్యే కొడుకును కంటుంది' అని హామీ ఇచ్చాడుగా. ఇంక రాజు ఈ అవకాశాన్ని ఎందుకు జారవిడుచుకుంటాడు? ఇతగాడి గురుదక్షిణేంటో కానీ నా జీవితాన్ని ఛిద్రంచేసింది' అనుకుంది బాధగా.

"అయితే ఈ సుందరికి బదులుగా గుర్రాలివ్వాలంటారు, అంతేనా?" అన్నాడు దివోదాసు.

"అవును రాజా, నల్లచెవులున్న తెల్ల గుర్రాలు ఆరొందలు కావాలి" చెప్పాడు గాలవుడు.

"అంతేకదా... విన్నారుగా సేనాపతీ, వెంటనే అలాంటి గుర్రాలను ఈ గాలవమునికి ఇప్పించండి"

"క్షమించండి రాజా, అలాంటివి అన్ని లేవు, రెండొందల వరకూ ఉంటాయంతే. అయితే తక్కినవి అంతకంటే శ్రేష్టమైన తిత్తిరి, కల్మాషం జాతి అశ్వాలున్నాయి. వాటినిద్దాం" అన్నాడు సేనాపతి.

"అబ్బే, మా గురువుగారు ఆమోదించరు..." కంగారుగా చెప్పి, అంతలోనే "రాజా, మీతో ఏకాంతంగా కొంచెం మాట్లాడాలనుకుంటున్నాను" అన్నాడు గాలవుడు.

వెంటనే మంత్రి, సేనాపతి కూడా రాజుదగ్గర సెలవు తీసుకుని వెళ్లిపోయారు.

"రాజా, మీవద్ద రెండొందల అశ్వాలే ఉన్నాయన్నారు కదా, అయితే ఒక పని చేద్దాం... మాధవిని ఒక కొడుకు పుట్టేవరకూ మీదగ్గరుం చుకోండి. తర్వాత మరో రాజుకు అప్పగించి తక్కిన గుర్రాలను అడుగుతాను. ఏమంటారు?!" అని గాలవుడు గుసగుసగా రాజును అడుగుతోంటే మాధవికి దుర్భరంగా అనిపించింది.

'ఏమనుకుంటున్నాడీ కపటముని?! తనేనో పశువుకింద భావిస్తున్నాడా?! మరోసారి గర్భశోకం పెట్టడానికి సిద్ధమయ్యాడా? అంటే గుర్రాలన్నీ దొరికేవరకూ తనతో ఇలాగే వ్యాపారం చేస్తాడా? ఇదేం బ్రతుకు? తానసలు ఎందుకు పుట్టింది? ఇతడి గురుదక్షిణ నెరవేర్చేందుకే పుట్టిందా? ఇంత దౌర్భాగ్యం మరే ఆడపిల్లకూ రాకూడదు' అనుకుంది.

"నాకేం అభ్యంతరం లేదు గాలవా. అయితే పరస్త్రీలను అక్కచెల్లెళ్లుగా భావించే నైజం నాది. అగ్నిసాక్షిగా పెళ్లాడితేనే భార్య. సంబంధం పవిత్రంగా ఉండాలంటే శాస్త్రోక్తంగా పెళ్లి జరగాలి" అన్నాడు దివోదాసు.

'అబ్బో, ఎంత గొప్పవాడివయ్యా రాజా, అగ్నిసాక్షిగా పెళ్లాడితేనే భార్య అంటున్నావా? అయితే ఇప్పటివరకూ ఎందర్ని పెళ్లాడావు? పవిత్రత గురించి మాట్లాడుతున్నావా? దెయ్యాలు వేదాలు వల్లిస్తే ఎలా ఉంటుందో రాజులు పవిత్రత గురించి చెప్తే అలాగే ఉంటుంది. ఇంతకీ ఈ బూటకపు పెళ్లిళ్లెందుకంటే స్త్రీని కేవలం తనకు మాత్రమే పరిమితమయ్యేలా ఉంచడంకోసం. వేరెవరివైపైనా చూశావంటే పాతివ్రత్యానికి భంగం కలుగుతుంది, పవిత్రత దెబ్బతింటుంది జాగ్రత్త అని హెచ్చరించడం, అంతే. అంతకుమించి మరేంలేదు. ఈ పెళ్లికి ముందూ తర్వాతా రాజు మాత్రం నిరభ్యంతరంగా ఎన్ని పెళ్లిళ్ళైనా చేసుకుంటాడు' అనుకుంది మాధవి కోపంగా.

గాలవుడిలో ఏ మూలో వున్న భయాలు, అనుమానాలు తొలగిపోయాయి.

"మీరు వినే వుంటారు, నేను అశ్వమేధయాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నాను. మరో పదిహేనురోజుల్లో యాగం మొదలవుతుంది. మరి ఈలోపు పెళ్ళి చేసుకోవచ్చో లేదో..." అంటూ నసిగాడు దివోదాసు.

"రాజంటే ప్రజాపతి. పాణిగ్రహణం అనేది శుభకార్యం. కనుక ఈ విషయంలో, అందునా సామాన్యులకై వల్లించిన నియమాలు మీకు వర్తించవు" తడుముకోకుండా జవాబు చెప్పాడు గాలవుడు.

దాంతో దివోదాసు ముఖం సూర్యబింబంలా వెలిగిపోయింది. 'ఈ సంగతి మహారాణి సత్యవతికి చెప్పాలా?' అని ఆలోచించాడు. 'చెప్తే కోపగించుకుంటుంది, అలక పాన్పెక్కుతుంది. అసూయపడ్తుంది. ఈ పెళ్లిని ఆమె ఆపలేకపోయినా తనకెంతోకొంత అశాంతి కలిగిస్తుంది. కనుక ముందే చెప్పి లేనిపోని తలనొప్పి కొనితెచ్చుకోనేల?! ఈ అతివ ఎంత బాగుంది? చూడగానే ఆకట్టుకునే అందం. తక్షణం ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది. కానీ తమాయించుకోక తప్పదు. ఈ ముగ్ధమోహన సౌందర్యాన్ని చూస్తోంటే ఎప్పుడెప్పుడు సొంతం చేసుకుందామా అనిపిస్తోంది. ఈ గాలవుడు చెప్పినట్టు ఈమెవల్ల తనకో కొడుకు పుడితే అంతకంటే కావలసిందేముంది? భరద్వాజమహర్షి మాట గాలికి పోతుందా? పుత్రకామేష్టి చేస్తే కొడుకు పుడతాడన్నాడు. యాగానికి ఏర్పాట్లు చేసినంతలోనే ఇంత అందాలరాశి తనవద్దకి వచ్చిందంటే శుభసూచకం కాదూ?! అంటే ఈ రూపంలో తన కోరిక నెరవేరనుందన్నమాట. ఏదేమైనా సత్యవతికి ముందేం చెప్పకూడదు. పెళ్ళైపోయాక ఏదో సర్ది చెప్పొచ్చు' అంటూ తర్జనభర్జనల అనంతరం ఒక నిర్ణయానికొచ్చాడు.



వెంటనే గాలవుణ్ని అతిథిగృహానికి, మాధవిని అంతఃపురానికి పంపి పురోహితునితో మాట్లాడి మరునటిరోజు ఉదయమే పెళ్లికి ఏర్పాటు చేయించాడు.

శాస్త్రోక్తంగా పెళ్లయింది. గాలవుడు మాధవి చేతిని దివోదాసు చేతిలో వుంచి కన్యాదానంచేసి అప్పగించాడు.

మాధవి గుండెలో అగ్నిపర్వతాలు బద్ధలౌతున్నట్లు, సముద్రం ఉప్పొంగుతున్నట్లు వుంది. కానీ ఆ శబ్దం, ఆ ఘోష గాలవుడు గ్రహించే స్థితిలో లేడు.

"మరి, నేను వెళ్లొస్తాను రాజా. కొద్దిదూరంలో వున్న అడవిలో ఆశ్రమం కట్టుకుని అందులో తపస్సు చేసుకుంటూ వుంటాను. సంవత్సరం కాగానే మీకు కొడుకు పుట్టాక కబురుచేస్తే వచ్చి మాధవిని తీసికెళ్తాను" అన్నాడు.

కానీ అతని చెవుల్లో ఋషిపత్ని వేదవతి మాటలు ప్రతిధ్వనించాయి. 'బాలింతరాల్ని గాలీవానల్లో నడిపించుకొస్తావా? ఆడపిల్లన్న కనికరం కూడా లేదా? ఆమె చస్తే ఏం చేసేవాడివి? స్త్రీ హత్య మహా పాతకం. ఆ పాపం నీ మెడకు చుట్టుకునేది' అన్న నిష్ఠూరపు మాటలు భయపెట్టడంతో వెంటనే నాలుక్కరుచుకుని "మరీ కొడుకు పుట్టగానే వద్దులే మహారాజా... ఎంతైనా పసివాణ్ణి వదిలి రావడం కష్టం కదా, కనుక కాన్పయ్యాక మరో నాలుగునెలలు గడవనిచ్చి కబురుచేయండి" అన్నాడు.

రాజు కళ్ళతోనే నవ్వాడు. 'ఏంటీ తెలివితక్కువ బ్రాహ్మడు ఇలా మాట్లాడతాడు? ఏదో ఇల్లలగ్గానే పండగ వచ్చేస్తుందనుకుంటున్నాడా? గర్భవతి కావడమంటే అంత తేలికా? పదేళ్ళనుంచీ తల్లడిల్లిపోతున్నా సత్యవతి కడుపున ఒక నలుసు పడలేదు. అలాంటిది ఇతడేమో పెళ్లయిన రోజునే బిడ్డ గురించి మాట్లాడుతూ సంవత్సరానికల్లా కొడుకు పుడతాడన్నట్లు చెప్తున్నాడు.. సరే ఇతడి వాక్యం ఫలించి కొడుకు పుడ్తే అంతకంటే కావల్సిందేముంది? ఒకవేళ పుట్టలేదూ అయినా మంచిదే. మాధవి పూర్తిగా తనతోనే ఉండిపోతుంది. గాలవుడు అదే కదా చెప్పాడు, కొడుకు పుట్టేవరకూ ఉంచుకోమని. యాగం పూర్తవ్వగానే సత్యవతి ఎటూ గర్భం దాల్చుతుంది' అనుకుని మౌనంగా తల పంకించాడు దివోదాసు.

... ఇంకా ఉంది

కాశీరాజు దివోదాసు వంశాభివృద్ధికై చేసిన పుత్రకామేష్టి యాగం, అశ్వమేధయాగం వైభవం ఎలాంటిది?

పుత్ర సంతానం యజ్ఞాల వల్ల కలిగిందా...మాధవి వల్లా?

మహారాణి సత్యవతి మాధవి రాకకు ఎలా స్పందించింది?

వచ్చేవారం...

క్యాంపస్ ఛాట్

స్నేహితులని భావించిన వారే హేళనగానూ, ఈసడింపుగానూ మాట్లాడుతున్నారా? వీరినసలు స్నేహితులని అనగలమా? ఇలాంటి వారే తమకెదురైనప్పుడు విద్యార్థులెలా వీరినెదుర్కొంటున్నారు?

కె శివలీల

సైలెంటవ్వడమా... సైలెన్స్ చేయడమా

ఏంటీ సీనియర్స్ నీ రూంకొచ్చారన్న స్పృహ లేకుండా ఉన్నావ్? ఓ...రేపు మీకు సెమినార్ కదూ. నీ వాలకం చూస్తే ఏదో ఫైనల్ ఎగ్జామ్‌కు ప్రిపేరవుతున్నట్లుంది. సెమినార్ క్లాసుకు ఇంత ప్రిపరేషన్ అవసరమా? ఏదీ నువ్వు కలెక్ట్ చేసిన ఇన్ఫర్మేషన్ ఒకసారివ్వు" అంటూ సంయుక్త చేతిలోని పేపర్లను లాక్కుంది రూప.

"ఇంత చండాలంగా ఉందేంటి. ఒక్క విషయమూ డెప్త్‌గా లేదు. నువ్వు చెప్పే సంగతటుంచు... వినేవారెవరో బలైపోయారే. ఐ పిటీ ఆన్ దెమ్" అని హేళనచేస్తూ గట్టిగా నవ్వసాగింది. స్నేహితులూ ఆమెతో శ్రుతి కలిపారు.

చిన్నబోయిన మొహంతో నిస్సహాయంగా వాళ్లను చూస్తుండిపోయింది సంయుక్త.

అచ్చుగుద్దినట్లు ఇలాంటిదే కాకపోయినా... ఈ కోవకు చెందిన అనుభవం మీకూ ఎప్పుడైనా ఎదురైందా? స్నేహితులని భావించిన వారే హేళనగానూ, ఈసడింపుగానూ మాట్లాడుతున్నారా? వీరినసలు స్నేహితులని అనగలమా? ఇలాంటి వారే తమకెదురైనప్పుడు విద్యార్థులెలా వీరినెదుర్కొంటున్నారు?

"నిజమైన ఫ్రెండ్సెప్పుడూ అలా ఎదుటివారిని కించపరిచినట్లు మాట్లాడరు. నా దృష్టిలో ఇలాంటి వారిని స్నేహితులనుకోవడం చాలా పెద్ద పొరబాటు. వీరిలో కొందరు విమర్శించి ఊరుకుంటే... మరి కొందరు దానితో పాటు... అది ఎలా ఉందో పోల్చి చెబుతారు. ఈ పోలికలను వింటే మన ఉత్సాహం కాస్తా హరించుకుపోతుంది. మూడ్ మొత్తం పాడైపోతుంది. అలా ఎదుటి వాళ్ల ఉత్సాహాన్ని నీరుగార్చడంలో వారికేం ఆనంద మొస్తుందో అర్థం కాదు" అంటోంది శారద.



"మొదట్లో ఇలాంటి వాళ్లతో నేను వాదనకు దిగేదాన్ని. కొన్నాళ్లకు వీరితో గెలవడం చాలా కష్టమని తెలుసుకున్నా. దానికన్నా సైలెంట్‌గా ఉండడమే బెటర్! అని డిసైడైపోయా. ఇలాంటి వారి విషయంలో ముఖ్యంగా గుర్తుంచుకోవలసిందేంటంటే... మాటలతో మనల్ని రెచ్చగొట్టినా మనం వారి మాటలకు ఎదురుచెప్పకూడదు. వాదనకు దిగకూడదు. దిగితే... మనల్ని మరిన్ని మాటలనడానికి ఆస్కారం వారికిచ్చినట్లే" అంటున్న రేణుక తాను ఇలా కంట్రోల్లో ఉండడానికి చాలా రోజులే పట్టిందని చెబుతోంది.



"నేను డిగ్రీ చదివే రోజుల్లో ఒక గ్యాంగుండేది. దాంట్లో ప్రతి ఒక్క మెంబరూ ఇలాంటిదే! ఎవరిని ఎలా కామెంట్ చేయాలా? అనే ఆలోచిస్తూ ఉంటారేమో. వీరి కంట్లో ఎవరుపడ్డా ఏదో మాట అనకుండా వదలరు. వారు మన కంటికి కనిపించకపోయినా...మనం ఆ ప్రదేశాన్ని వదిలి వెళ్లినా... వారి మాటలే మన చెవుల్లో గింగురుమంటుంటాయి. మన ఆత్మవిశ్వాసాన్ని బాగా దెబ్బతీస్తాయి. దీనికొక్కటే సొల్యూషన్...వీరనే ప్రతి మాటనీ సాధ్యమైనంత వరకు పాజిటివ్‌గా తీసుకోవడం. కొన్ని సందర్భాల్లో ఈ గ్యాంగులోని మెంబర్లంతాకలిసి తలా నాలుగుమాటలనేస్తారు. మనం ఎదురు తిరిగామనుకోండి... ఇక అంతే! అందుకే వీరి నోళ్లు మూయించాలనుకోవడం కన్నా... మనం నోరుమూసుకోవడమే బెటర్" అని చెబుతోంది తేజస్వి.

మీకూ ఇలాంటి సమస్యలే ఎదురయ్యాయా? ఏంటీ...వారితో వాదించారా? గొడవపడ్డారా? ఇంకోసారిలాంటి ప్రయత్నం చేయకూడదనీ, వీరికసలు ఎదురుపడకూడదనీ అనుకుంటున్నారా? ఇలా ఎప్పటికప్పుడు తప్పించుకోవడం "తప్పించుకు తిరుగువారు ధన్యులు సుమతీ" అనుకోవడంలాంటిది. ఇలాంటి డిస్టర్బెన్స్ గ్యాంగునలా కొనసాగనివ్వడమేనా...? ఎవరో ఒకరు వీరి బారిన పడుతూనే ఉండాలా...చెప్పండి? ఓ పనిచేస్తే బాగుంటుందేమో చూడండి. ఇలాంటి వారి చేతిలో గాయపడ్డవారినీ, 'ఇలాంటి మాటల చెడుగుడు మంచిది కాదు' అనే వాళ్లనీ మీతో కలుపుకోండి. అంతా కలిసి ఓ పద్ధతిగా వారికి జవాబివ్వండి. సరౌతారు. లేదా ఇక మీ జోలికిరారు.

*

చందు

ఎం ఎస్ రెడ్డి అనే ఈ సినీరంగ పెద్దాయిన ఇదివరకంటే తెరవెనకే ఉండేవారు. రాజశేఖర్ హీరోగా నటించిన అంకుశం సినిమాలో ముఖ్యమంత్రిగా తెరమీదకూడా కనబడతారు. అప్పుడా పెద్దమనిషిని చూడాలి. ఆయన మాటతీరు వినాలి. ఆ స్వరంలో, ఆ నటనలో ఓ పెద్దరికం, దానితోపాటు 'నేనంత కాచివడబోశానో చూడండి' అన్నంత ఆత్మవిశ్వాసం కనబడుతుంది. ఆయన ఒక నిర్మాత, రచయిత, దర్శకుడు, వీటన్నింటికీ కావాల్సిన నటుడు. ఆయన చెప్పే అనుభవాలు విందాం.

భోళామనిషి... ఎమ్మెస్ రెడ్డి

లలిత కళలవట్ల ఉన్న అపార అభిమానంతో ఒక అనువాద చిత్ర నిర్మాతగా 1966లో సినిమా పరిశ్రమలో ప్రవేశించాను. నేను వ్యాపార రీత్యా సక్సెస్‌ఫుల్ వ్యాపారస్తుణ్ని, నష్టం అనేది నా ఖాతాలో ఎప్పుడూ లేదు. గూడూరులో మైకా వ్యాపారం చేసేటపుడు ఎన్నో ఒడిదుడుకులకు మైకా పరిశ్రమ లోనైంది. అయినా నా నిఘంటువులో నష్టం అనే మాట లేదు. ఆ రోజుల్లో కళాకారులుగా రామారావు, నాగేశ్వరరావు, ఎస్.వి. రంగారావు, డైరెక్టర్లుగా కె.వి. రెడ్డిగారు, బి.యన్. రెడ్డిగారు, గూడవల్లి రాంబ్రహ్మంగారు, పుల్లయ్యగారు, కమలాకర కామేశ్వరరావుగారు ఉన్నారు. ఇంతమంది మహనీయుల మధ్యలో ప్రవేశించానన్న గర్వంతో ఉన్నాను. నాకు రాముడు అభిమాన దైవం. రామాయణంలో సుందరకాండ ప్రాముఖ్యత నాకు తెలుసు కాబట్టి రాముడిగా రామారావుగారిని, రావణాసురుడిగా యస్.వి. రంగారావుగారిని పెట్టి సినిమా తీయాలనుకుని రామారావుగారిని కలిస్తే 'లేదు బ్రదర్ రామాయణాన్ని నేనే తీయాలనుకుంటున్నాను. అది తప్ప ఏదైనా ప్రయత్నం చేయండి అన్నారు. అప్పుడు గత్యంతరంలేక రామారావు గారి మీద అభిమానం కొద్దీ ఆయనతో ఒక చిత్రమైనా చేయాలనే సంకల్పంతో, ఆశకొద్దీ 'శ్రీకృష్ణ విజయం' అనే సినిమాను తీశాను. ఈ చిత్రానికి పింగళి నాగేంద్రరావుగారు రైటర్. మధవపెద్ది గోఖలేగారు కళా దర్శకుడు. పెండ్యాల నాగేశ్వరరావుగారు సంగీత దర్శకుడు. కమలాకర కామేశ్వరరావుగారు దర్శకుడు. రంగారావుగారు ప్రతి నాయకుడు. వీళ్ళందరితో కలసి పనిచేసినపుడు సాహిత్యపరంగా, కళాపరంగా, సంగీతపరంగా ఎన్నో తెలుసుకున్నాను. ఆ రోజుల్లో స్టోరీ డిస్కషన్స్‌లో కళా దర్శకుడు, మ్యూజిక్ డైరెక్టర్‌ని కూడా కూర్చోపెట్టుకునే వాళ్ళం. సమావేశం 8.00 గంటలకంటే ఏ రోజూ ఐదునిముషాలు కూడా ఆలస్యం కాలేదు. అంతటి క్రమశిక్షణ, కార్యదీక్షతతో కూడుకున్న రోజులవి.

ఆర్థికంగా నష్టపోయినా సినిమా పరిశ్రకు రుణపడి ఉన్నా

సినిమా పరిశ్రమలో అడుగెట్టడం వల్ల నేను ఆర్థికంగా చాలా నష్టపోయాను. అంతమాత్రం చేత సినిమా పరిశ్రమలోకి రావడం తప్పని భావించడం లేదు. ఏ రంగంలోనైనా లాభం, నష్టం రెండూ ఉంటాయి. సినిమా పరిశ్రమలో నా సాహిత్యాన్ని, నా కళాభిరుచిని పెంచుకోవడానికి అవకాశం కలిగి ఎక్కువే లాభపడ్డా. సినిమా ఫీల్డ్‌కి పోకుండా నా వ్యాపారాలు కంటిన్యూ చేసి ఉంటే ఎంత సంపాదించేవాడ్నో ఊహకందదు. అది నాకు తెలుసు. వ్యాపారంలో అటువంటి పేరుంది. నన్నొక మనిషిగా సమాజానికి ఎత్తి చూపించింది ఈ సినిమా పరిశ్రమ. రచయితగా నా సినిమాలకు పాటలు రాసుకుని, నన్ను నేను నిరూపించుకోవడానికి సినిమా పరిశ్రమ చాలా దోహదపడింది. అందువల్ల సినిమా ఫీల్డుకు ఇప్పటికీ రుణపడివున్నాను.



చేతులు దానంతట అవే లెగిసేవి

రామారావుగారికి దండం పెట్టాలంటే చేతులు దానంతట అవే లెగిసేవి. దేశం గర్వించదగ్గ కళాకారుడాయన. కళాకారుడిగా అంత గొప్పవాడు ఆంధ్రదేశంలో లేడని నా భావం. చిత్తూరు నాగయ్యగారు ఎంత సంపాదించాడో అంతా పోగొట్టుకున్నాడు. ఆయన చేసిన పాత్రలు ఎలాంటివో మనకు తెలుసు. పోతన, రామదాసు, త్యాగయ్య... పాత్రలను అజరామరం చేసిన మహానుభావుడు. 'రెడ్డిగారు, మీరు సరస్వతీ పుత్రులు. మీరు నాకు దండం పెట్టకూడదు' అనేవారు. నేను ప్రయత్నపూర్వకంగా ఎవరికీ దండం పెట్టను. ఎదుటివాని వ్యక్తిత్వం, గొప్పతనం నన్ను ఆకర్షించి దండం పెట్టాలనిపిస్తే చేతులు వాటంతట అవే లేస్తాయి. మెహర్బానీ కోసం నేను దండం పెట్టను అన్నాను.

కాలంతో కలసి నడవాల్సిందే

కాలం పరిణామశీలి. ప్రతి ఒక్కరూ కాలంతో కలసి నడవాల్సిందే. కొత్తకు ఆహ్వానం పలకాల్సిందే. పాతను పట్టుకుని వేలాడేవాణ్ని కాదు. కొత్త కొత్త డైరెక్టర్లు... కొత్త రచయితలు... కొత్త కొత్త నటీనటులు... రావాల్సిందే. కాలం ఎంత పరిమాణ శీలి అయినా సూర్యుడు తూర్పునే ఉదయిస్తాడు. పడమటనే అస్తమిస్తున్నాడు. క్రమబద్ధంగా భూమి తిరుగుతూనే ఉంది. కాలం ఎంతగా మారిపోయినా తరతరాలుగా, వేల సంవత్సరాలుగా పెద్దలు ఇచ్చిపోయినటువంటి తెలుగు సంస్కృతినీ, భాషనూ, తెలుగు కళల ఔన్నత్యాన్నీ, సంప్రదాయాన్నీ ప్రతిబింబిస్తూ మారిన కాలానికి అనుగుణంగా పాతనూ కొత్తనూ సమ్మిళితం చేసుకుని పోవాలి. ❀

(మరిన్ని విశేషాలు వచ్చేవారం...)

9 తేడాలేవబ్బా!



కత్తిరించి అతికించండి



ఇవన్నీ ఓ నక్క శరీర భాగాలు. వాటిని కత్తిరించి అతికించి నక్కను చేయండి చూద్దాం.

చిన్నారి చిత్రకారులు

ఎం. రవి బ్రహ్మచారి,
6వ తరగతి,
శ్రీవాణి విద్యాలయం,
జనగాం, వరంగల్.

సాధికా బేగం, 10వ తరగతి,
ఊరుపేరు రాయలేదు.

ఎన్. శ్రావణి, 6వ తరగతి,
ప్రగతి బాల విద్యాలయం,
తాడేపల్లి, గుంటూరు.

మీరూ చక్కటి బొమ్మలు వేస్తారా?
మరైతే వెంటనే కార్డుమీద వేసి మాకు పంపండి. ప్రచురిస్తాం. చిరునామా: చిన్నారి చిత్రకారులు, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్ నగర్, హైదరాబాద్.

వీరివీరి గుమ్మడిపండు వీరి పేరేమి?

హాలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినదేంటో తెలుసా! ఏంటి అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నారు. ఓ... 'ఇదేం చిహ్నమా?' అనా! ఇది ఒక అంతర్జాతీయ సంస్థ గుర్తు. దాని పుట్టినరోజును మరో వారం పది రోజుల్లో జరుపుకోబోతోంది. మరయితే వెంటనే కార్డు మీద రాసేసి పోస్ట్ చెయ్యండే. మా చిరునామా: **వీరి వీరి గుమ్మడి పండు,** బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్లేట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాద్.

9.10.05 సమాధానం:
పికాసో

2.10.05కు సరైన సమాధానాలు రాసినవారు

బి.సృజన, 8వ తరగతి, గీతాంజలి ఉన్నత పాఠశాల, అశోక్ నగర్, హైదరాబాదు. కె.చరిత, 6వ తరగతి, పాయిస్ హై స్కూల్, రాంనగర్, హైదరాబాదు. ఎం.శ్వేత, 4వ తరగతి, అభ్యుదయ హై స్కూల్, హైదరాబాదు. కె.సాహిల్, 3వ తరగతి, అభ్యుదయ హై స్కూల్, అశోక్‌నగర్, హైదరాబాదు. వి.ప్రత్యూష, 9వ తరగతి, గౌతం మోడల్ స్కూల్, డొంక రోడ్, విజయవాడ. వి.సుమ, 6వ తరగతి, గౌతం మోడల్ స్కూల్, ఆర్‌టిసీ క్రాస్ రోడ్స్, హైదరాబాద్. పి.లుషిప్త, 8వ తరగతి, ముషీరాబాద్. అనూహ్య, ఖమ్మం. శ్రావణి, 5వ తరగతి, వరంగల్. ఇ.ఎస్.ఎ.శృతి, 5వ తరగతి, ఆంథొనీస్ స్కూల్, హైదరాబాద్. జిక్కీ సాధన్, చైతన్య, సౌజన్య, గుంటుపల్లి, కృష్ణా జిల్లా. శాంతి, 10వ తరగతి, కృష్ణ లంక, విజయవాడ. వివేక్, 9వ తరగతి, విజయనగరం. చందు, 3వ తరగతి, జూబ్లీ హిల్స్, హైదరాబాదు. యామిని, స్మరణ్, సాయి చందన్, ఉప్పల్, గాంధీ నగర్. ఉదయ్ కిరణ్, మాధురి, 9వ తరగతి, వరంగల్.



గతవారం జవాబులు

ఎన్ని పదాలు రాయగలరు!

cent, cesti, cist, cite, et, etic iciest, incite, insect, inset, insist, inti intis, it, its, neist, nest, net, nets netts, nicest, nit, nite, nits, scent **SCIENTIST**, sect, seniti, sent, senti set, sett, setts, sit, site, sits, sitten, snit, snits, stein, stet, stets, stint, stints, ten, tens, tent, test, testis, tests, tet, tets, ti, tic, tie, tin, tinct, tincts, tine, tiniest, tins, tint, tis, titi...etc.

రెండు చదరాలే మిగలాలంటే....



'L' తో వచ్చేదెవరో!

హేయ్! పైన ఆంగ్ల అక్షరం 'L'తో వచ్చేవి కొన్ని వున్నాయి. అవేంటో కనిపెట్టండి చూద్దాం.

పప్పీకి రంగులేసేద్దాం



అట్టమీది కథ



మన ఆహారం పిజ్జా బర్గర్లా...?!!

అమృత

ఈరోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం. ప్రజల సంస్కృతిలో ఆహారం ఓ ముఖ్యమైన భాగం. ఆకులు-అలమలు, పచ్చి మాంసం తినే రోజుల నుండి పేరు వింటేనే నోరూరే ఘుమఘుమలతో వేడివేడి వంటకాలు మన టేబుల్‌పైకి నడిచొచ్చే స్థాయికి ఎదిగాం. అయినా తృప్తి తీరలేదు. నాలుక సరికొత్త రుచులు కోరుతోంది. ఈ క్రమంలో చల్లారిన పదార్థాలను ఓవెన్‌లో వేసి హాట్‌హాట్‌గా తినే స్థాయికి చేరుకున్నాం.

అమ్మమ్మ ముందురోజు రాత్రే మినపప్పు రుబ్బి, గుడ్డకట్టిన గిన్నెలో కుడుమేసి ఆవిరిపై ఉడికించి ఉంచారు. పొద్దునే దానిపై నెయ్యి వేసి మరీ తినిపించారు. ఇక చూస్కోండి... ఆ టిఫిను రుచికి రుచీ...బలానికి బలం. నాయనమ్మ అందరం తింటామని మినపప్పు రుబ్బి మధ్యాహ్నం వరకూ అట్టిపెట్టింది. మూకుడులో నూనె వేసి దానినిండా మినప్పిండి వేసి పలుచటి రేకు మూతపెట్టి, దాని మీద కూడా నిప్పులు వేసింది. ఇకచూడు నా సావిరంగా...ఆ పిండి అన్ని వైపులా దోరగా వేగి, దిబ్బరొట్టెగా మారి నోరూరించింది. ఆ దిబ్బరొట్టిని ముక్కలుగా చేసి తలో ముక్కా ఇస్తే ఊదుకుని ఊదుకుని తింటాం. "హాట్‌లోపలికి ఈ స్వీట్ ఎలా వెళ్లింది" అని తెల్లదొరలు ఆశ్చర్యపోయిన పూర్ణం బూరెలు, ఓ అద్భుత రుచుల సమ్మేళనమైన సున్నుండ, అరిశెలు ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి.
పెసరట్టు లోపల ఉప్మా దట్టించి, దానికి అల్లం చెట్నీ నంజితే ఇక చూస్కోండి. స్వర్గం ఉందో లేదోగానీ అలాంటిది ప్రాప్తి ముక్కకు దగ్గరవుతూ ఉంటుంది. కానీ ఆశ్చర్యం...ఇప్పుడా ఆహారపదార్థాలేవి? అవి చేసుకునే సమయమేదీ? పట్నవాసులకు అవన్నీ పల్లెటూరి వంటకాలయ్యాయి. ఇక పల్లెల్లో తిండిలేక అవన్నీ అంతర్థానమైనాయి. ఏ అంతర్జాతీయ మంత్రగాడి మంత్రదండం తిప్పుడికి కనుమరుగైపోయాయి? తిండి విషయంలో ఎటునుండి ఎటువైపుకు వెళుతున్నామో చూడండి...

ఇప్పుడు మహానగరాల్లో ఛాట్ భండార్‌లు విపరీతమైన రద్దీతో ఉంటున్నాయి. వాస్తవానికి ఇందులో దొరికే వెరైటీలు ఉత్తరాది భారతీయ వంటకాలతో ముడిపడి ఉన్నాయి. సమోస, రగడా, భేల్‌పురి, సేవ్‌పురి, పానీపూరి, కట్‌లెట్‌లకు విపరీతమైన గిరాకీ. శెనగలు, బఠాణీలతో తయారయ్యే ఛాట్ వెరైటీలలో అధిక క్యాలరీల శక్తి ఉంటుంది. పైగా ఇవన్నీ మసాలాలతో రూపొందించినవి కావటంతో జీర్ణమవ్వడం కష్టం. అయినా జనం ఛాట్ భండార్ల చుట్టూచేరి ఆవురావురుమంటూ తింటుంటారు. హైదరాబాద్‌లోని కోఠి సెంటర్‌లో ఉన్న 'గోకుల్ ఛాట్ భండార్'కు ప్రతిరోజూ వందలాదిమంది వస్తారు. దశాబ్దాలుగా కొనసాగుత్ను వాటిలో ఇదొకటి. ఇక రాష్ట్రమంతా మిర్చి సెంటర్లు కొనసాగుతున్నాయి. సాయంత్రం అయితే ఇక్కడకు వయసుతో నిమిత్తం లేకుండా చేరతారు. తిని, ఇంటికి పార్సిల్ తీసుకుపోతుంటారు. అయితే చాలా సెంటర్లలోని నూనె మరిగి-మరిగి ఉంటుంది. అదేనూనె మరుసటి రోజూ వాడతారు. దీనివలన ఎసిడిటీ తయారవుతుందని డాక్టర్లు సెలవిస్తున్నారు. పైగా నాసిరకం నూనె వాడతారనీ అందరికీ తెలుసు.

మిర్చీ బండీ పోయి...రెస్టారెంట్లూ వచ్చే...

గత నాలుగైదు సంవత్సరాలుగా మిర్చి, ఛాట్ భండార్‌లను దెబ్బతీసన్తూ రెస్టారెంట్లు వచ్చాయి. స్కూలు పిల్లల నుండి ఉద్యోగస్తులు,

అంతర్జాతీయ ఆహార దినోత్సవం-2005 పిలుపు

ఐక్యరాజ్య సమితిలో భాగమైన 'ఆహారమూ మరియు వ్యవసాయ సమన్వయ సంస్థ' 1945వ సంవత్సరంలో ఏర్పడింది. ప్రతీ ఏడాదీ అక్టోబర్ 16వ తేదీన ప్రపంచ ఆహారదినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. ప్రతీ ఏడాది ఒక ఆలోచనను "ఆ ఏడాది థీమ్"గా ప్రకటిస్తూ వచ్చింది. 2005వ సంవత్సర ఆహార దినోత్సవానికి థీమ్‌గా "వ్యవసాయం-అంతర్‌సాంస్కృతిక అభిభాషణ" అని ప్రకటించింది. ఈ దృక్పథంలో ప్రపంచ వ్యవసాయవిధానాల గురించి, విభిన్న సాంస్కృతిక వారసత్వాల గురించి, ఆకలి-పర్యావరణ హీనతల గురించి చర్చించమని పిలుపు ఇచ్చింది. "ఇది మన సర్వసాధారణ సాంస్కృతిక వారసత్వం" అని నినాదమందించింది.

వ్యవసాయం కనుగొనకముందు ఆహారాన్వేషణ, వేట నాటి ఆదిమానవుల తిండీతిప్పలుగా ఉండేది. అనేక పరిణామాల తరువాత ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో వ్యవసాయం దాదాపు పదివేల సంవత్సరాల నాడు ఏర్పడింది. వ్యవసాయ ఆవిర్భావ చరిత్ర విభిన్న సాంస్కృతిక మార్పిడికి ఉదాహరణగా నిలుస్తుంది.మొట్టమొదటి పురావస్తు చారిత్రక పత్రాల సమాచారంలో యూరప్ వ్యవసాయ పరిణామాల్లో సాధారణ పరికరాలుపయోగించినట్లు తెలుస్తుంది. ఆ పరికరాలు, పరిజ్ఞానం మధ్య తూర్పు ప్రాంతంనుంచి యూరప్‌కు చేరిందని ఒక వాదన ఉంది. అదే సమయంలో ఇటు ఆఫ్రికా, మధ్య, దక్షిణ అమెరికా, చైనా, భారతదేశం తూర్పుఆసియా ప్రాంతాల ప్రజలు వ్యవసాయం వివిధ రీతులలో చేస్తున్నారు. మనిషి ఆహారం కోసం పూర్తిగా ఆధారపడదగ్గ వనరు వ్యవసాయం. అందుకే వ్యవసాయానికి, ఆహార సంస్కృతికి చాలా దగ్గర సంబంధం వుంది.

- ఆహారమూ వ్యవసాయ సమన్వయ సంస్థ, అంతర్జాతీయ సమితి(యు.యన్.)

గృహిణుల వరకు ఎవరైనా నిర్భయంగా వెళ్లి, తక్కువ ఖర్చుతో నచ్చిన ఐటమ్ తినివచ్చే అవకాశం వీటివల్ల ఏర్పడింది. మిత్రులతో చిట్‌చాట్ కోసం సరదాగా వెళ్ళే కుర్రకారు, పెద్దహోటళ్ళకి వెళ్ళి తినలేని ఉద్యోగులు, షాపింగ్‌కు వచ్చి అలసిపోయిన మహిళలు సరదాగా వెళ్లి రుచికరమైన ఐటమ్స్ తినే అవకాశాన్ని ఇవి కల్పిస్తున్నాయి. దీని నిర్వాహకులు పార్టీలు కూడా ఏర్పాటు చేస్తుంటారు. కాలేజీ పిల్లల బర్త్‌డే సందర్భంగానో, మరో సందర్భంగానో ఇక్కడకు వచ్చి పార్టీలు చేసుకుంటారు. ఈ పార్టీల కోసం కస్టమర్ వెయ్యి నుంచి రెండు వేల వరకు ఖర్చు చేస్తుంటారని అమీర్‌పేటలోని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం అయితే చాలు, నలుగురు ఒకచోట కూర్చుని కబుర్లాడుతూ కాలక్షేపం చేయడానికి రెస్టారెంట్లు అనువుగా ఉంటున్నందున వాటికి గిరాకీ పెరిగింది. అంతేకాదు, ఇంట్లో రొటీన్ రుచులకు భిన్నంగా, కొత్తరుచులతో నానారకాల వంటకాలు అక్కడ లభించే అవకాశం ఉండటంతోనో, జిహ్వాచాపల్యంతో వీటివైపు పరుగులు తీస్తున్నారు. విస్తరిస్తున్న కన్స్యూమరిజం, మార్కెట్ సంస్కృతి వల్ల కూడా ప్రజల్లో వీటిపట్ల మోజు పెరిగింది. రొటీన్‌కు భిన్నంగా ఉండే వ్యవహారం, ఆనందం కోసం కుటుంబ సభ్యులు కూడా కలిసి వెళుతున్నారు. ప్రతిరోజూ ఉండే టెన్షన్‌లకు భిన్నంగా వీటిని ఆశ్రయిస్తున్నారు. అయితే వీటిని బేకరీలు దెబ్బతీశాయి!.

హోటళ్లూ పోయే...బేకరీలొచ్చే

బేకరీలు పెరగటంతో మన జీవనశైలిలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. తినే ఆహారపు అలవాట్లు మారిపోయాయి. కొత్తరుచులతో సరికొత్త పదార్థాలు మన ముందుకు వస్తున్నాయి. ఉదయం టిఫిన్ సాయంత్రం స్నాక్స్ స్థానంలో సరికొత్త పదార్థాలు చోటుచేసుకున్నాయి. తిండిని ఎంజాయ్ చేయటం జీవితంలో ఓ భాగమైంది. చెప్పలేని ఆనందాన్ని నలుగురిలో పంచుకోవడానికి విందు-వినోదాలనే ప్రధానంగా భావిస్తున్నారు. ఇవే జీవితంలో కీలకమైనవిగా మాట్లాడుతున్నారు. ఉద్యోగం వచ్చినా, మ్యారేజి సెటిలయ్యినా, జీవితంలో ఏ కొత్తమార్పు చోటుచేసుకున్నా వెంటనే "పార్టీ ఎప్పుడిస్తావ్?..." అనేమాట ఎదుటివారి నుండి వస్తుంది. అంటే ఆ ఆనందాన్ని సంతోషాన్ని పంచటానికి పంచుకోడానికి తిండే ప్రధానమని భావించే ధోరణి పెరిగింది. కొత్త రుచులు అందించే లోగిళ్లు ఈ తరహా వ్యక్తుల పాలిట స్వర్గధామాలయ్యాయి. మనసుకు ఉత్సాహం, ఆనందం, ప్రశాంతత లభించాలంటే కోరిన తిండి తినడమే పరమానందంగా భావిస్తున్నారు. వీటికి తక్కువ ఖర్చుతో మనకందిస్తున్నాయి బేకరీలు. ఏడాది క్రితం వరకు హైదరాబాద్ నగరంలో రెండు వేలకుపైగా బేకరీలు బిజీగా నడుస్తుండేవి. కేక్, క్రీంరోల్స్, దిల్‌కుష్‌లు, పేస్ట్రీ, రోటర్స్ (చికెన్, మటన్), కట్ లెట్స్, పఫ్స్.... నిత్యం అందుబాటులో ఉండేవి. వీటికి తోడు కూల్‌డ్రింక్స్, ఇన్‌స్టాంట్ కాఫీ కూడా. కాలేజీకి దగ్గర్లో ఉండే బేకరీలలో బిజినెస్ మరీను. అయితే ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. చైనీస్ ఫుడ్ పాయింట్స్, పిజ్జాలు తమ వ్యాపారాన్ని దెబ్బతిశాయని బేకరీ యాజమానులు చెపుతున్నారు. "ఇదంతా వెస్ట్రన్ కల్చర్, ఇక్కడి వెరైటీలు కూడా దాదాపు అటువంటివే. మనవాళ్ళు ఆ కల్చర్‌ను అనుసరిస్తూ ఆ ఫుడ్‌ను ప్రిఫర్ చేస్తున్నారని మేమెంతో సంతోషించాం. కానీ ఇప్పటి యూత్ మరో అడుగు ముందుకేసి చైనీస్ ఫుడ్, పిజ్జాలవైపు మొగ్గు చూపుతున్నారు. కేవలం అనుకరణ వల్లనే మోజు పెరిగిందనుకుంటే పొరపాటే. నగరవాసులకు పిజ్జాలను తినిపించటం వెనుక బహుళజాతి సంస్థల హస్తం ఉంది. అంతేకాక పిజ్జా సెంటర్‌లకు వెళ్ళే అమ్మాయిల సంఖ్య బాగా పెరిగింది... దీంతో ఈ అమ్మాయిల కోసం వెళ్ళే అబ్బాయిల సంఖ్యకూడా పెరిగింది".

మనిషి కోసం ఆహారమా...ఆహారం కోసం మనిషా...!

ఒకప్పుడు మనుగడ కోసం, పుష్టిగా, బలంగా ఉండటం కోసం ఆహారం అవసరమని భావించే వాళ్ళం. అందుకే గురజాడ కూడా, "తిండికలిగితె కండకలదోయ్... కండ కలవాడేను మనిషోయ్..." అని సెలవిచ్చారు. అందుకేనేమో ఆ రోజుల్లో పౌష్టికాహారం గురించి తెలుసుకునేవాళ్లు. కానీ ఇప్పుడు పట్టణాల్లో, నగరాల్లో మధ్య తరగతి, ఉన్నతవర్గాలవారు తినే తిండి చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. వీళ్ళల్లో ఎక్కువ మంది తింటోంది పిజ్జాలే. ఎందుకంటే ఇప్పుడు బహుళజాతి ఆహారానికి మనిషి అవసరమయ్యాడు! మార్కెట్ ఉత్పత్తి చేసే ఆహారం కోసం మనిషి అర్రులు చాస్తున్నాడు. బహుళ జాతి కంపెనీలు వీటిని నగరవాసులకు "అనివార్యం..." అనుకునేలా అలవాటు చేయటానికి ఓ వ్యూహం పన్నాయి. సక్సెస్ అయ్యాయి.

పెసరట్టు ఉప్మా పోయే... పిజ్జా బర్గర్లూ వచ్చే

ప్రధానంగా మూడు దశలుగా ఈ పిజ్జాలను మార్కెట్ చేశారు. మొదట్లో లగ్జూరియస్ ఐటం అని ప్రచారం చేశారు. ఉన్నత మధ్య తరగతివారిని ఎంచుకున్నారు. హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరికీ అలవాటు చేయలనేది వీరి టార్గెట్. దీన్ని జోన్‌లవైజ్‌గా పాపులర్ చేశారు. తర్వాత గల్లీ గల్లీ పావులర్ అవ్వాలని చూశారు. దీని కోసం ప్రధానంగా మూడు కంపెనీలు పంచుకున్నాయి. స్నాక్స్ ఐటమ్స్‌ను సాయంత్రం తింటారు. కానీ సాయంత్రంపూటేకాదు ఎప్పుడైనా ఎక్కడైనా పిజ్జాలే తినాలి అనేట్టు చేస్తున్నారు. పిజ్జాహట్, పిజ్జాకార్నర్, డామినోస్... ఇప్పుడు హైదరాబాద్‌ను ఏలుతున్నాయంటే ఆశ్చర్యం లేదు. పిజ్జాహట్ రెస్టారెంట్ టైప్. దీనికి యూత్ టార్గెట్ కాదు. మిడిల్ ఏజ్ (32-50) కపుల్స్. వీళ్ళ స్కీమ్స్ అన్నింటిలో "ఫర్ ఏ కపుల్" అనేది ప్రజంట్ అవుతుంది.

పిజ్జా కార్నర్ పిల్లలను టార్గెట్ చేస్తుంది. టీవిలో వచ్చే నూడుల్స్, బర్గర్స్, పిజ్జాస్, ఐస్‌క్రీమ్‌ల ప్రకటనల్ని చూసి అవి కావాలని మారాం చేయని పిల్లలెవరైనా ఉంటారా? ఇలా నెమ్మదిగా మనుషుల బుర్రల్లోకి ఎక్కిన రుచుల వ్యామోహం కారణంగా అన్ని స్థాయిల్లో ఈ పరిశ్రమ విస్తరించింది. పిల్లల



దద్ధోజనం మొహం మొత్తిందా...!

గత నెలలో జరిగిన వినాయక చవితికి అపార్ట్‌మెంట్‌లో వాళ్ళు కుడుములు తయారుచేశారు. తెలంగాణా ప్రాంతంలో ఉండ్రాళ్ళు చేస్తారే తప్ప కుడుములు చేయరు. గడ్డిలోపెట్టి ఆవిరితో తయారుచేసే కుడుముల గురించి వాళ్ళకు తెలియదట. అక్కడి వాళ్ళంతా వాటిని విచిత్రంగా చూశారు. ఇక దద్ధోజనం, దిబ్బరొట్టి... వంటి తిండ్లు ఇప్పుడు తిట్లుగా మారాయి. చాలామందికి వీటి విలువ తెలియదు. వీటిలో ఎన్నో పోషక పదార్థాలు ఉన్నాయి. ఇటువంటి వాటిని వదిలేసి మనవాళ్లు ఫాస్టుఫుడ్, పిజ్జా సెంటర్‌లకు ఎగబడుతున్నారు.

పండ్లు చేదయ్యాయా...!

గతంలో తెలిసిన వాళ్ళ ఇంటికి వెళితే పండ్లు తీసుకుని వెళ్ళేవాళ్ళు. ఇప్పుడు ఫ్యాషన్ ముదిరిందికదా, అందుకే అటువంటి పద్ధతులు కరువయ్యాయి. స్వీట్ ప్యాకెట్‌తో బంధువులనో, ఫ్రెండ్స్‌ను కలవటం ఇప్పటి స్టయిల్. ఆఖరికి పిల్లలకు కూడా బిస్కట్లు, చాక్‌లెట్లు, ఐస్‌క్రీమ్‌లు అలవాటు చేస్తున్నారు. ఇది స్టేటస్ సింబల్. ఏ కాలంలో వచ్చే పండ్లను ఆ కాలంలో తింటే సగం జబ్బులు దరిచేరవు. కానీ ఇతర ఆహార పదార్థాలపై చేసే ఖర్చులో పదో వంతుకూడా ఫ్రూట్స్‌కోసం వెచ్చించరు. కనీసం రోజు రెండు అరటిపండ్లు తినేవారు కూడా అరుదయ్యారు.

బర్త్‌డేలు, ఫాదర్స్‌డే, మదర్స్‌డే... ఇలా పిల్లలు జరిపే సందర్భాలను వీరు ఎంచుకుంటారు. మన చేతిలో డబ్బుండాలేకానీ, బర్త్‌డే పిల్లవాడికి కొత్తబట్టలు వేసి అక్కడికి తీసుకుపోతే సరి. మిగతావన్నీ వాళ్ళే చూసుకుంటారు. కేక్ కూల్‌డ్రింక్‌తోపాటు పిజ్జాల్లో బోలెడన్ని వెరైటీలు సప్లయ్ చేస్తారు. అక్కడ పిల్లలకు జోష్ ఉంటుంది. పోటీలు జరుగుతుంటాయి. ఆ పోటీల్లో కనిపించేది పిజ్జాఏ. మాక్ డ్రింక్, మాక్ డిస్కోలు జరుగుతుంటాయి. అక్కడా అంతా పిజ్జా ప్రపంచమే.

ఇక డామినోస్ టార్గెట్ ఐటి, కాలేజీలు, గృహిణులు. హోమ్ డెలివరీ చేస్తారు. వారానికి రెండుసార్లన్నా పిజ్జాలు తినాలని వీళ్లు ప్రచారం చేస్తారు. మహిళలు డెయిలీ సీరియల్స్ చూస్తూ ఎంజాయ్ చేయాలనేది వీరి కాన్సెప్ట్. ఐటి మార్కెట్ రంగాలలో లభిస్తున్న వేతనాలు కూడా ఈ వేలం వెర్రికి తోడవుతున్నాయి. 'అర్డరిచ్చిన ముప్పై నిమిషాల్లోపలే డోర్ డెలివరీ... లేకుంటే ఫ్రీ' అని ప్రకటనలతో హోరెత్తిస్తున్నాయి.

పిజ్జా సెంటర్లకు దిగుమతి అయ్యేదంతా టిన్ ఫుడ్. టిన్‌లో వచ్చిన కలిపిన పిండి, ఇతర పదార్థాలు... కావలసిన మేరకు తీసుకుని బేక్‌చేసి వేడివేడి పిజ్జా సప్లయ్ చేస్తారు.

భోజనం బోర్... బర్గర్-పిజ్జా హుర్రే!

ఇప్పుడు హైదరాబాద్, విశాఖ, విజయవాడ, తిరుపతి, కర్నూల్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, గుంటూరు, ఒంగోలుకు ఈ క్రేజ్ పాకింది. పిజ్జా తినిపించటమే ఆ వ్యాపారుల ముఖ్య లక్ష్యం. ఇప్పుడు భోజనం స్థానంలో పిజ్జాలను నిలపాలని వ్యాపారులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. హైటెక్ సిటీని ఈ విధంగానే ఈ 'ఆహార విధానం' ఆక్రమించి రాజ్యమేలుతోంది. ఇతర నగరాల్లోని పెద్దమనుషులు ఇదే ఉన్నతుల స్టయిల్‌గా పరుగులు తీస్తున్నారు. నిజం చెప్పాలంటే ఇటలీలోని వ్యవసాయ కార్మికుల కోసం పిజ్జాలు తయారు చేశారు. అటువంటివాటిని మనం ఫ్యాషన్ పేరుతో ఆబగా తింటున్నాం.

ఫుడ్ బిజినెస్సా... బిజినెస్ ఫుడ్డా...

దీనంతటికీ ప్రధాన కారణం వ్యాపారం. తెరవెనుక సూత్రధారులు వ్యాపారులే. తాము తయారు చేసే ఆహార పదార్థాల వైపు అబగా చూసేలా మనిషిని తయారు చేసే పరిస్థితిని యాడ్స్ తెచ్చిపెడుతున్నాయి. అందుకే పిజ్జా కార్నర్లు, చికెన్‌బర్గర్ సెంటర్లకు అంతగిరాకీ. నానా రకాల ఐటమ్స్‌కు సంబంధించిన ప్రకటనలు మన ఆహారపు అలవాట్లను నియంత్రించటానికి ఉపకరిస్తున్నాయి. ఈ క్రమాన మనం ఎంత తినాలో, ఎలా తినాలో, ఏయే సందర్భాల్లో ఏమేం తినాలో నేర్పడం మార్కెట్ వంతయింది. ఏం తాగాలో, ఏ కాలంలో ఏ డ్రింకు మనకు ఆనందాన్ని ఇస్తుందో, ఆత్మ విశ్వాసాన్నిస్తుందో తెలియజెప్పే యాడ్స్ పరంపరకు అంతుండదు. ఫలానా తిండి తింటే మన జీవితమే మారిపోతుందని భ్రమింపచేసే యాడ్స్ జోరుకు పగ్గాలు లేవు, ఆ క్రమంలో యాడ్స్ మనల్ని నియంత్రిస్తున్నాయి. అవసరంలేని వాటిని కూడా మన మీద రుద్దుతున్నాయి. ఈ విషయాన్ని గమనించే లోపే వాటి విషవలయం లోకి చేరుతున్నాం. మనకు తెలియకుండానే నానా రకాల తిండి తినటానికి అలవాటు పడుతున్నాం.

శరీరాల బరువు పెంచుకుంటున్నాం. మనమే బరువైన నేపథ్యాన తిండి తగ్గించడానికి ఉపక్రమిస్తున్నాం. ఇప్పటి వరకు జరుగుతున్న తంతు ఇది. కానీ ప్రకృతిలో లభించే ఆహారంపై మనిషి ఆధారపడితే ఇంత దుఃఖం ఉండకపోయేదనిపిస్తుంది. మన ఆహార సంస్కృతిని రద్దుచేసి, మనకు సంబంధం లేని మనదికాని తిండిని మన మీద రుద్దితే కిమ్మనకుండా ఆమోదించి అలవరుచుకుంటున్నాం. ఈ విందులే వినోదాలుగా తలపోస్తున్నాం.

పిజ్జాల వలన ఫ్యాట్, కొలస్ట్రాల్ పెరుగుతోంది. శరీరంలో నిస్సత్తువ ఆవహిస్తోంది. ఆడపిల్లల హార్మోన్లలో అసమతుల్యత వచ్చి తొమ్మిదేళ్లకే రజస్వలలవుతున్నారు. ఆహారంలో పీచు పదార్థం పూర్తిగా మాయమైపోతోంది. దానితో విదేశీయులకు మాత్రమే పరిమితమైన మలబద్ధకం మనవాళ్లకూ సర్వసాధారణమైపోతోంది. ఇది వాస్తవం. అమెరికాలోనే ఈ వాస్తవాన్ని ప్రయోగాత్మకంగా నిరూపించారు. కనుక ఏం తినాలో ఇప్పటికైనా మనకు మనమే నిర్ణయించుకుంటే బాగుంటుంది. మన తిండి మనం తిందాం. మన ఆహార సంస్కృతిని కాపాడుకుందాం.

❀





ఆరోగ్యం

డాక్టర్ నాగినేని భాస్కరరావు

కూరగాయల్లో విటమిన్ - కె

విటమిన్ - కె ఒక నియంత్రణ మాంసకృత్తితో కలిసి కాలేయంలో తయారయ్యే రక్తం గడ్డకట్టే మాంసకృత్తుల తయారీకి ముఖ్యంగా ప్రోత్రాంబిన్ తయారీ నియంత్రణలో అతి ముఖ్యమైనది. క్వినోన్స్‌గా పిలవబడే పదార్థాలతో కూడింది విటమిన్ - కె. మనం తినే కూరగాయల్లో ఉండే విటమిన్ - కెను ఫైలోక్వినోన్ అని, ప్రేవుల్లో బ్యాక్టీరియా తయారు చేసే విటమిన్ - కె2ను మెనోక్వినోన్ అని పిలుస్తారు. ప్రేవుల్లోని బ్యాక్టీరియా విటమిన్ - కెను కె2గా మారుస్తాయి. ఇది కొవ్వులో కరిగే విటమిన్. అందువల్ల దీని శోషణానికి పిత్తరసం అవసరం. కనుక ఇది చిన్నప్రేవుల పై భాగంలో శోషించబడుతుంది.

మనకు కావలసిన విటమిన్ - కెలో సగం మనం తినే కూరగాయల ద్వారా లభిస్తుంది. మిగతా సగాన్ని చిన్న ప్రేవుల్లోని బ్యాక్టీరియా తయారు చేస్తుంది. మన శరీరంలో విటమిన్ - కె నిల్వలు చాలా తక్కువగా ఉంటాయి. కిలో బరువుకు రోజుకు ఒకటి నుంచి రెండు మి.గ్రా. చొప్పున విటమిన్ కె అవసరమవుతుంది.

నెల తక్కువ, బరువు తక్కువ ఉన్న శిశువులు, అక్సిజన్ తక్కువైన శిశువులు, రక్తం గడ్డకట్టకుండా ఉండేం దుకు మందులు వాడుతున్న



తల్లులు విటమిన్ కె లోపానికి గురవుతారు. తల్లిపాలలో విటమిన్ కె చాలా తక్కువగా ఉంటుంది. కనుక కేవలం తల్లిపాలు తాగే పసి పిల్లలు కూడా విటమిన్ కె లోపానికి గురవుతారు. సాధారణంగా ఆహార లోపం వల్ల విటమిన్ కె లోపం రాదు. పెద్దల్లో కామెర్ల జబ్బు, శోషణ లోపం వల్లగానీ, నోటి ద్వారా ఇచ్చే సల్ఫా మందులు చిన్న ప్రేవుల్లోని బాక్టీరియాను చంపడం వల్ల విటమిన్ కె తయారీలో లోపం వల్లగానీ ఈ విటమిన్ లోపం వస్తుంది. దీని లోపం వల్ల కలిగే లక్షణాలు తీవ్రమైన కాలేయ జబ్బులో కన్పిస్తాయి.

విటమిన్ కె లోపం వల్ల ప్రోత్రాంబిన్ తగ్గిపోవడం, చర్మం, మ్యూకస్ మెంబ్రేన్ నుంచి రక్తస్రావం అయ్యే సూచనలుంటాయి. ఆపరేషన్ చేసినప్పుడు ఎక్కువగా రక్తస్రావం జరుగుతుంది. విటమిన్ కె లోపం వల్ల పుట్టే శిశువుకు మెదడులో రక్తనాళాలు చిట్ల వచ్చు.

రక్తస్రావం జరిగేట్లున్న అప్పుడే పుట్టిన బిడ్డకు ఒకటి నుంచి రెండు మి.గ్రా. విటమిన్ కెను కండరానికి ఇంజక్షన్ ద్వారా ఇచ్చి నివారించవచ్చు. ఎక్కువ కాలం నోటి ద్వారా యాంటీ బయాటిక్ మందులను తీసుకునే రోగులకు నోటి ద్వారా గానీ, ఇంజక్షన్ (కండరానికి) ద్వారా గానీ రోజుకు 2.5 మి.గ్రా. విటమిన్ కెను ఇవ్వవచ్చును. ప్రోత్రాంబిన్ లోపం వల్ల కలిగే రక్తస్రావం, రక్తం గడ్డకట్టకుండా వాడే మందుల వల్ల, కాలేయం జబ్బు పడటం వల్ల కలిగే రక్తస్రావాలను 12 గంటల్లోగా రక్తాన్ని ఇవ్వడం ద్వారా సరిచేయవచ్చు.

విటమిన్ కె తోటకూర, క్యాబేజీ, కాలీఫ్లవర్, పంది కాలేయంలో లభిస్తుంది. ❀



సవరణ : గత వారం విటమిన్ బి 1 లోపం వల్ల బెరిబెరి, రికెట్స్ సంభవిస్తాయి అని వచ్చింది. దానిని విటమిన్ బి 1 లోపం వల్ల, బెరిబెరి, వెర్నిక్స్ అండ్ కొరసొఫ్స్ సిండ్రోమ్ సంభవిస్తాయి అని చదువుకోగలరు.

కథ

పాడుబుద్ధి పాడుగాను!

యర్నాగుల సుధాకరరావు

> "పోనీలేరా... మనమొకప్పుడు పాచిపోయి, బంకలాగ సాగుతున్న పుల్వా తింటూ ఏమనుకునేటోల్లమి...పాడు పుల్వా కాత్తి బాగున్నప్పుడిస్తే వాళ్ల సొమ్మేం పోయిద్దీ...అని అనేకసార్లు గొణుక్కున్నాం. ఆ పాడు బుద్ధి నాక్కూడా పట్టేసినాది.

"నువ్వు నాకా దేముడిచ్చిన వరం రా కన్నా...! నా రెక్కల కష్టంతో నిన్నింతవాణ్ని సేసేను. నీకు సర్కార్ కొలువు దొరికింది. ఇక నీ రెక్కలు నీకొచ్చినట్టే...."

ఎస్సీ హాస్టల్ వార్డెన్‌గా తనకుద్యోగం దొరికినప్పుడు అమ్మ నంబరవడుతూ అన్న మాటలు...ఆమె ముఖంలోని హావభావాలు కృష్ణప్పకు ఇప్పటికీ స్పష్టంగా గుర్తున్నాయి.

ఉద్యోగం దొరికాక గ్రామానికి రావడం అదే తొలిసారి... తల్లి ఎలా ఉందోనని ఒకవైపు ఆదుర్దాగా ఉంది. ఉద్యోగాని కొచ్చేప్పుడు ఆమె తనకు చెప్పిన ధైర్యం అంతాఇంతా కాదు.

"ఉద్యోగంలో కుదురుగా ఉండు. సీటికీమాటికీ రామాకు. సెలవులున్నప్పుడే వస్తుండు... " అని చెప్పిన అమ్మ మాటలు తలచుకుంటూనే బస్సుదిగాడు.

బిడ్డను చూసి మురిసిపోయింది తల్లి. పెద్ద గోనె సంచులతో తాను తెచ్చిన సామాన్లను గుడిసెనిండా సర్దుతున్నాడు కృష్ణయ్య. ఆశ్చర్యంగా వాటినే చూస్తూ కూర్చుంది.

"నాయనా నిన్ను సూసుకుంటూ కూసుండిపోయాను. ఏం తిన్నావో ఏమిటో. వేడిగా బువ్వ చేస్తా. కోమటికొట్టు కాడ పిండొడియాలు తీసుకురానా?" అని అడిగింది తలనిమురుతూ.

"అమ్మా ఇప్పుడు నేను చాలా బాగా వంట చేయగలను. ఎంతైనా వార్డెన్‌ను కదా! ఈ సామాన్లేంటనుకున్నావు. వంటపాత్రలు, పప్పులు, ఉప్పులు. అన్నట్లు ఆ సొట్ట పుంజు ఉందా?"

"అదిగో సలిసీమల్ని ఏరుతోంది"

"అమ్మా... దాన్ని కోసి పలావ్ సేద్దామే"

"ఏటి పలావా..అది సేయడం నీకొచ్చేసిందా? దానికి నెయ్య, గరమ్మచాలా బాగా పడతాయి. మనకాడ అవెక్కడున్నాయి"

"అవన్నీ తెచ్చాను. ముందు ఆ పుంజును పట్టుకో"

కృష్ణప్ప స్టౌ వెలిగించాడు. దానిపై పెద్దపాత్ర పెట్టి...నీళ్లు పోశాడు. బాస్మతి బియ్యం పొట్లాన్ని, గరం మసాలాపేస్టును దగ్గరగా పెట్టుకుంటూ

ఒకింత గర్వంగా అనుభూతి చెందాడు.

గంజి, అన్నం తప్పితే ఇలాంటి పలావులు తల్లికి తెలీవు. పెద్దింట్లోని విందుల్లో మిగిలిన పలావు ఇంటికి తెచ్చేది. అప్పటికే అది బంకలా సాగేది. వాసనొచ్చేది. అయినా తనూ, తన తల్లీ ఆబగా తినేవారం. అవన్నీ గుర్తొచ్చి నిర్వేదంగా తలవిదిల్చాడు. తిరిగి పలావ్ తయారీలో పడ్డాడు.

రెండు గంటల శ్రమ...

వేడి వేడి పలావ్ ఘుమఘుమలాడుతోంది. తల్లివైపు చూశాడు. ఆమె నోట్లో నీళ్లూరుతున్నాయి. కన్నీళ్లు... బుగ్గల మీదుగా జారుతున్నాయి.

"నాయనా! ఏ పెద్దోళ్ల విందుల్లోనో... మిగిలింది తినేటోళ్లం! ఈ రోజు ఏకంగా వండేసినావు... కళ్ల ముందు బాననిండా పుల్వ ఉంది. మనం తినగా మిగిలింది బంకలా సాగకముందే ఈరమ్మకిద్దాం... ఏమంటావు?'

"ఇంతకీ... ఈరమ్మెలా ఉంది? దాని కొడుకు మిలట్రీకెళ్లి పత్తాలేకుండా పోయాడు. అదివ్వుడెలా బతుకుతోంది''

"సెప్పకేటిగానీ... ఆ మిలట్రీ వోడు ఎవతెనో మరిగిసి తల్లిని మరిసిపోనాడు. అదీ కథ..."

"సరేలే... వేడిమీదే పలావ్ తినాలి. పళ్లాలు కడిగి తీసుకురా. నీకు కడుపు నిండినంత తిను. నువ్వు తింటుంటే తృప్తిగా చూడాలి" అని తల్లి చేతిలో కొత్త పళ్లాలు పెట్టాడు ఆప్యాయంగా.

"భలే కుదిరిందమ్మా... ఎంత రుచిగా ఉంది. సొట్టపుంజు మాంచి కండ పట్టి పుష్టిగా తయారైంది. ఏదైనా నాటు కోడి రుచే రుచి"

"తెల్లారేకల్లా నన్ను నిద్దుర లేపేది. రేపట్నించి దాని కూత కరువే..." బాధపడింది.

"అలాంటి పదిపుంజులు కొనగలమమ్మా మనం" ఒకింత గర్వంగా చెప్పాడు. అన్నట్లు ఈరమ్మకు పలావ్ ఇస్తానన్నావుగా... పట్టుకెళ్లి ఇచ్చేయ్"

"ఏంటోరా.... ఇంత ఖరీదెట్టి సేసావు. రేపటివరకు మనమే తిందాం మిగిలితే దానికిద్దాం. ఇచ్చినా అది కుళ్లుకుంటది. నీ మీద దానికి అక్కసు పెరుగుద్ది తల్లిని సూత్తన్నావని... దాని కొడుకు సెడ్డోడు కదా"

తల్లి లాజిక్ విని నవ్వుకున్నాడు.

మళ్లీ ఏమనుకుందో ఏమో...తనే వేడివేడిగా ఉన్న పలావు ఆకులో వేసి పొట్లాం కడుతూ, "పోనీలేరా...మనమొకప్పుడు పాచిపోయి, బంకనాగ సాగుతున్న పుల్వా తింటూ ఏమనుకునేటోల్లమి...పాడు పుల్వా కాత్తి బాగున్నప్పుడిస్తే వాళ్ల సొమ్మేం పోయిద్దీ...అని అనేకసార్లు గొణుక్కున్నాం. పాడు బుద్ధి నాక్కూడా పట్టేసినాది. పాపం ఈరమ్మకు మాత్రం ఎవరున్నారు. దానికీ నీకు లాగా చేసిపెట్టే కొడుకు లేదుపాపం" అంది.

తీసుకెళ్లి ఈరమ్మకిస్తూ "ఇది పెద్దింటోళ్లది కాదు. నా కొడుకే సేశాడు" అని చెప్పింది కొద్దిపాటి గర్వంగా.

పప్పెట్ ఇంటర్వ్యూ

ఉదయశంకర్

ఇస్తాం ఇస్తాం... ఇవ్వలేం ఇవ్వలేం

రాష్ట్ర అసెంబ్లీ భవన సముదాయానికి వెనుక వైపున చాలా ఖాళీ స్థలముంది. అక్కడున్న చెట్టూ చేమల్లో అరవైఏళ్ల వయసున్న ఊడలమర్రి కూడా ఉండేటప్పటికి భేతాళుడు, విక్రమార్కుడు హైదరాబాద్ క్యాంపుకొస్తే ఉంటానికి వీలుగా ఉంది. ఇంకేముంది వర్షాకాల అసెంబ్లీ సమావేశాలు కూడా చూసినట్లుంటుందని అక్కడే మకాం పెట్టారు.

"సెక్యూరిటీ రీత్యా ఆ జాగాను చెట్టూచేమలతో అలరారనిస్తున్నారు గానీ లేకుంటేనా...ఆ జాగాకి క్కూడా చ.సెం.మీ. ఏ పదివేలకో రేటు పలికేది" అన్నాడు భేతాళేశ్వరావు.

"అదేంటి భేతాళా...ఎవరన్నా అమ్మేవాడు, కొనేవాడు స్థలాన్ని గజాలెక్కన, చదరపు గజాలెక్కన చెబుతారు కదా...నువ్వేంటి...చదరపు సెంటీమీటరు లెక్కన చెబుతున్నావు" అన్నాడు విక్రమార్కుడు.

"బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజీ మాయలాగ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడీ వెలువడ్డంతోటే హైదరాబాద్ చుట్టుపక్కల స్థలాల రేట్లకు రాకెట్టుమందు కూరినట్లయ్యిందిలే... గురూజీ అదిగో అసెంబ్లీలో ఏం బుర్ర వేడెక్కిందోనని చల్లగాలికోసమని వస్తున్న ఆ జమాలెక్కల మంత్రివరేణ్యుడిటే వస్తున్నారు"

"భేతాళా... మనక్కావలసిన మంత్రివర్యులు కొణిజేటి ఇంటివారు రోశయ్యగారు వస్తున్నారు. వేషం మార్చేయ్. ఈ వారం వారిని ఇంటర్వ్యూ చేద్దాం"

విక్రమార్కులవారు అలా సెలవివ్వగానే...వారంవారం వీక్లీరూపం దాల్చారిద్దరూ.

- - -

వి మార్క్ : సార్... రోశయ్యగారూ... నమస్తే సార్

రోశయ్య : ఇవ్వలేం... ఇవ్వలేం.

బి తాళ్ : రోశయ్యగారూ నేనూ విడియో కెమెరా వెనుకనుంచి నమస్తే చెబుతున్నానండీ.

రోశయ్య : ఇవ్వలేం... ఉద్యోగాలివ్వలేం.

వి మార్క్ : ఉద్యోగాలు కాదండీ మేమడిగేది...మా బీవీ టీవీ ప్రశ్నలకు జవాబులు ఇవ్వండి చాలు.

రోశయ్య : ఏవయ్యా బీవీ టీవీ వారూ మీకేం పద్ధతీ పాడూ ఏమీ లేవా...ఏదో బుర్రవేడి చల్లబరుచుకుందామని నేనిలా చల్లగాలికొస్తే మీరు ఇక్కడా నన్నిడిచిపెట్టకపోతే ఎలాగయ్యా చెప్పండి?

వి మార్క్ : అదికాదండి. మీరు అనుభవశీలురైన మంత్రివర్యులు... అక్కడా ఇక్కడనేంటి సార్ ఎక్కడైనా ఏ నిముషాన్నైనా ఎలాంటి ప్రశ్నడిగినా ఠక్కున సమాధానం ఇవ్వగలరని నా నమ్మకం సార్.

రోశయ్య : ఈ విధంగా నన్ను మెప్పించి ఒప్పించి ఇంటర్వ్యూ అవకాశం తీసుకోగలగటం న్యాయమా చెప్పు విలేకరసోదరా...

వి మార్క్ : ఇందాక మీరు ఇవ్వలేం ఇవ్వలేం అని కలవరిస్తున్నారు. అంటే లోపల అసెంబ్లీలో మీ బుర్ర వేడెక్కించిన నేటి హాట్ ఐటమ్ అదేనా సార్?

రోశయ్య : అవునయ్యా... మా ప్రతిపక్ష మిత్రులకు ప్రశ్నలు సంధించే సమయంలో ఆ ప్రశ్నే తట్టింది. యువతకు ఉద్యోగాలివ్వరా...అని వాళ్లకు జవాబు తెలిసిన ప్రశ్నే మాకు వేశారు.

వి మార్క్ : తెలుగుదేశం వారు తమకు జవాబు తెలిసిన ప్రశ్నే వేశారని మీరెలా చెప్పగలుగుతున్నారు సార్?

రోశయ్య : ఎందుకంటే వారి హయంలో అదే ప్రశ్న మేం వేస్తే నాటి అధికారపార్టీగా వారు చెప్పిన సమాధానమే మేమూ చెబుతాం కదా.



బి తాళ్ : అంటే మీ జవాబు తేదేవారికి, వారి ప్రశ్న మీకు ముందే తెలుసన్నమాట. మరిందంతా తెలవనిది ప్రజలకేనా సార్...

రోశయ్య : అలా ఎందుకంటాం తమ్ముడూ...నో కామెంట్ అంటాంగానీ...

వి మార్క్ : సార్ మీ ఎన్నికల ప్రచారంలో మేం రికార్డ్ చేసిన క్లిప్పింగ్ ఇదుగోండి ఒక్కసారి మా కెమేరా విండోలో చూడండి సార్...(చూపించాడు) అప్పుడు మీరు రెండున్నర లక్షల ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేస్తామని అన్నారు కదా...

రోశయ్య : ఒక్కసారి కెమేరా అపుతారా. మీ నోట్ బుక్కు ఒక్కనిముషం మూస్తారా...ఈ ఆఫ్‌ది రికార్డ్ లో చెప్పేదేవిటంటే ఎన్నికలు కదా నాన్నా...అలా చెప్పకపోతే ఓట్లేస్తారా...మీరే చెప్పండి. ఇప్పుడు రికార్డ్ ఆన్‌లో రాసుకోండి... మేం ఉపన్యాసపూర్వకంగా చెప్పినమాట వాస్తవమే గానీ మా ఎన్నికల ప్రణాళికలో అలాంటి వేవీ రాసుకోలేదని సవినయంగా గుర్తుచేస్తున్నాను. ఎందుకంటే అలాంటి వాగ్దానాలు ఇవ్వరాదని శ్రీమాన్ ప్రపంచబ్యాంకువారు మాకు ముందే ఆదేశమిచ్చారు. ఆ మాటకొస్తే మాకేంటి ప్రపంచబ్యాంకు జీతగాడు అనే మీలాంటివారి నోట మార్మోగిన చంద్రబాబుగారికి ఇచ్చిన ఆదేశమేనని అందువల్ల పత్రికాముఖంగా, ఈ మీడియా కెమేరా లెన్సుముఖంగా ఇలాంటి ప్రశ్నలు మీరు వేయరాదని తేదేవారికి చెబుతున్నాను.

వి మార్క్ : మీరిచ్చిన ఉద్యోగాలు తేదేవారు,తేదేవారిచ్చిన ఉద్యోగాలు మీరు ఊడబీకే సందట్లో మల్టీ పర్పస్ వ్యవసాయ విస్తరణాధికారులను తొలగించారని తెలుస్తోంది. అలాగే డాక్టర్ పోస్టుల భర్తీ అలాగే ఉంచేశారని మీ ప్రతిపక్షాలవారే ఆరోపిస్తున్నారు. మరి దానికి మీ సమాధానం ఏవిటో మీ టీవీ ప్రేక్షకులకు వివరిస్తారని ఆశిస్తున్నాను.

రోశయ్య : బీవీ టీవీ ప్రసారంలో పపెట్ ఇంటర్వ్యూ కార్యక్రమం చూస్తున్న ప్రేక్షక ప్రజలారా...మూసేసిన, మూసేస్తున్న శాఖల్లో ఉద్యోగాలడిగితే మా మాట "ఇవ్వలేం ఇవ్వలేం" అనేనని మీకు తెలుసు. ఇద్దామనుకుంటున్న డాక్టర్ బ్యాక్‌లాక్ ఉద్యోగాలకు అభ్యర్థులు కరువయ్యారు కాబట్టి అందుకు కూడా "ఇవ్వలేం ఇవ్వలేం" అని విన్నవించుకుంటున్నాను. దీన్ని రాజకీయం చేయాలని చూస్తున్న తేదేవారి "చూపు-2020"లో కూడా ఇదే ఉందని తెలియజేస్తున్నాను.

మనమూ - మన నమ్మకాలు

డా॥ దేవరాజు మహారాజు

గాలి దయ్యాలు

ఒక వ్యక్తి రోడ్డుపై నడుస్తున్నాడు. లయబద్ధంగా గజ్జెల చప్పుడు... డోలు వాయిద్యం వినిపించాయి. "హోం హ్రీం క్లీం - దిగు దిగూ" అనే అరుపులూ వినిపించాయి. చుట్టూ పరికించి చూశాడు. దూరంగా మాంత్రికుడు, అతని చుట్టూ శిష్యగణం కనిపించారు. వాళ్లు ఓ కత్తితో బాలుని తలపై గాట్లు పెడుతున్నారు. గాట్లలో నిమ్మరసం పిండుతున్నారు. బాటసారి మనసు విలవిలలాడింది. వారికి అడ్డు తగిలాడు. మాంత్రికునికి కోపమొచ్చింది.

"ఊఁ ఎవడురావీడు ? చెప్పండిరా ఆవలకు పొమ్మని ! "హోం భీం...క్లీం...హట్" అన్నాడు.

బాటసారి తిరగబడ్డాడు "ఆఁ పోతాలే - పెద్ద మీసాలు పెంచుకోగానే పెద్ద మాంత్రికుడివై పొయ్యావా? అకారణంగా ఆ బాలుణ్ని చంపుతున్నావ్?" అన్నాడు.

"అకారణముగా కాదురా నరుడా ! వీని లోని దుష్ట శక్తులను తరిమి వేయుటకు మేము ప్రయత్నించుచుంటిమి. పొమ్మావలకు... హిహిహి-భ్రీంఫట్-హ్రీం-ఫట్" అని అరిచాడు.

"అయ్యయ్యో ! పిల్లాడు నీరసంతో సోలి పోతున్నాడు. పై పెచ్చు గాలి దయ్యాల పేరుతో వాడ్ని చంపేట్టున్నావు. హిప్పోక్రొట్స్ గురించి విన్నావురా ఎప్పుడైనా? అయినా నీకు చదువేలేదు. నీకు హిప్పోక్రెట్స్ గురించి తెలిసే అవకాశమే లేదు"

"నిన్ను భస్మం చేస్తా" అంటూ పెద్దపెట్టున అరిచాడు మాంత్రికుడు.

"భస్మమా ? నీ శ్రార్ధమా ? ఛట్ నోర్ముయ్. మంత్రాల పేరుతో పొట్టగడుపుకునే వాడివి. గ్రీవ్‌వైర్లుడు హిప్పోక్రొట్స్ ఏం చెప్పాడో తెలుసా ? 'శరీరంలో కొన్ని జీవ ద్రవాలుంటాయనీ, అవి ఉండాల్సిన నిష్పత్తిలో ఉండకపోతే, సమతూకం దెబ్బతిని, అంతర్గతంగా శరీరంలోనే రోగం పుడుతదనీ' అన్నాడు. అసలు నీ అజ్ఞానమే ఒక దుష్టశక్తి. ముందు దాన్ని వదిలించుకో. ఆ పిల్లాణ్నొదిలెయ్ !" అని అన్నాడు.

మాంత్రికుని అహం దెబ్బతింది. అమాంతం బాటసారి వైపుకు పరిగెత్తాడు.

"ఓరోరి! నీకును పిచ్చియున్నది. ఇప్పుడే వదిలింతును. ఢింభకా... వాడి నాలుక నుండి రక్తము పిండి వేయవలె. వాడిని పట్టుకొనుడు. హ్రోం... భ్రీం... క్లీం... ఫట్! ద్రూ... గ్రీం...క్లీం... హాట్" మాంత్రికుడు శిష్యగణం బాటసారిని పట్టుకోవడానికి పరుగుతీశారు.

ఇదేదో మూర్ఖ సమాజంలాగుంది. తనకా ఈ ఊరు కొత్త... అనువుగాని చోట అధికులమనరాదు. ప్రస్తుతం బయటపడి, తర్వాత చేయగలిగేదేమైనా ఉంటే చెయ్యొచ్చు అనుకొని, బాటసారి వారి నుండి తప్పించుకుని చాలా దూరం వెళ్లిపోయాడు.

"మా శక్తులను శంకించు వానినిక ఉపేక్షించగూడదు. దేభ్యముల వలె నా ముఖం చూచుచుంటిరేలరా? వాడిని పట్టితెండు. దయ్యము వదిలించెద" అంటూ మాంత్రికుడు శిష్యుల్ని మరింతగా అరిచాడు.

"ఆ తుచ్ఛుడు ఎప్పుడో హిపోక్రేట్స్ చెప్పినది నిజమనుకొనుచున్నాడు. మొన్న మొన్న ఎరెస్ట్రేటస్ ఏమి చెప్పెనో మరిచిపోయినాడా? శరీరమున రక్తమధికమైన రోగములు సంప్రాప్తించుననిచెప్పలేదా? అందువల్లనే కదా ఈ బలిసిన ఈ బాలకుని రక్తము తీసి వేయుచుంటిమి" అని భయంకరంగా కేకలు పెట్టాడు.

శిష్యులంతా అతడి చుట్టూ చేరి డోలు, తప్పెట్లు వాయించసాగారు.

తనను అర్థం చేసుకునే వారెవరైనా నలుగురు కనబడితే వారి సహాయంతో మాంత్రికుని ఆట కట్టించాలని చూస్తున్నాడా బాటసారి.

బాటసారి అంటే మనిషి. అతని ప్రయాణమెప్పుడూ ఆగిపోలేదు. రెండు వేల నాలుగు వారాల సంవత్సరాలకు పూర్వం గ్రీకు వైద్యుడు హిప్పోక్రేట్స్ రోగకారణాన్ని చూచాయగా ఊహించాడు. శరీరంలోని జీవద్రవాల్లో అవకతవకలేర్పడినప్పుడు అనూహ్యమైన మార్పులు సంభవిస్తాయనీ, ఆరోగ్యవంతమైన మనిషి శరీరం అకస్మాత్తుగా రోగానికి నిలయమైపోతుందనీ అన్నాడు. రోగం రావడానికి అతిముఖ్యమైన కారణాన్ని ఊహించాడు. అందుకే వైద్యశాస్త్ర పిత అయ్యాడు. ఎరాసిస్ట్రేటస్ జనాన్ని పెడతోవ పట్టించి, అతి భయంకరమైన, నీచమైన వైద్య విధానాలను ప్రారంభించాడు. మొదట్లో బ్యాడ్ స్పిరిట్స్ ఇన్‌ఫ్లూయెన్స్ వల్ల రోగాలొస్తాయని అనుకున్నారు. ఉదాహరణకు ఇప్పటికీ కొన్ని పదాలు వాడుకలో ఉన్నాయి. ఇన్‌ఫ్లూయెన్స్ అనే పదానికి సమానార్థ పదం లాటిన్‌లో **Influenza.** ఈ పేరుతో ఒక వ్యాధి ఇప్పటికీ ఉంది. అలాగే మలేరియా అంటే ఇటాలియన్ భాషలో 'చెడుగాలి' అని అర్థం. దీన్నే మన పూర్వీకులు గాలిసోకిందనీ, దయ్యం పట్టిందనీ వాడుకునే వారు. కాని ఆ గాలిలో ఉన్న బాక్టీరియాలు, వైరస్‌ల సంగతి వారికర్థం కాలేదు. దేవుణ్ని నమ్ముకుని, మత గ్రంథాలలోని చరణాలు స్మరిస్తే రోగాలు నయమైపోతాయని కొందరు నమ్మారు. ఇంకా నమ్ముతూనే ఉన్నారు. పూర్వజన్మలో భయంకరమైన పాపాలు చేసిన వారికి చర్మవ్యాధులొసోకుతాయని మరికొందరు నమ్మారు. అయితే వాటికి శాస్త్రసమ్మతమైన నిరూపణలేవు. పాపాలంటే వారి దృష్టిలో పరస్త్రీలను చెరబట్టడం, తాగుడు, జూదం, పొగ, నల్లమందు మొదలైనవి. పూర్వజన్మ సంగతెలా ఉన్నా - వీటిలో విచ్చలవిడి శృంగారం భయంకరమైన సుఖవ్యాధులకు దారితీస్తే, మిగతావన్నీ శారీరక ధర్మాల్ని పూర్తిగా దెబ్బతీస్తాయన్నది నిజమే కదా? ❀

ఓ ఊరి కథ

జి. మద్దయ్య

బండెడు చరిత్ర కలిగిన బనగానపల్లె



ఈ ఊరిపేరు వినగానే టక్కున నవాబులు గుర్తుకొస్తారు కదూ. 1651లో సిద్దిసుంబల్ అనే సేనానిని నిజాం పాలకులు బనగానపల్లెకు జాగీర్దారుగా నియమించారు. ఆ తరువాత ఈస్ట్ ఇండియా కంపెనీ మన దేశంలోకి రావడంతో బనగానపల్లె 1782లో స్వతంత్ర సంస్థానంగా మారింది. అప్పటినుంచి 1947లో స్వాతంత్ర్యమొచ్చే వరకూ నవాబులే ఈ ప్రాంతాన్ని పరిపాలించేవారు. మామిడిలో ప్రసిద్ధిచెందిన బంగినపల్లె రకం ఈ ప్రాంతంలో విస్తారంగా పండుతుంది. దీంతోనే ఊరిపేరు బనగానపల్లెగా ప్రచారంలోకొచ్చిందని చరిత్ర చెబుతోంది. ఈ పండ్లను బ్రిటీషు దొరలు ఇతర దేశాలకు తీసుకెళ్లేవారట. బనగాన పల్లెకు పక్కనే బానుముక్కల అనే గ్రామముండేదనీ, క్రమంగా బనగానపల్లెలో కలిసిందనీ పెద్దల మాట. కాలజ్ఞాన తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామివారు బాల్యంలో బనగానపల్లెలోని గరిమిరెడ్డి అచ్చమ్మ ఇంట్లో పశువుల కాపరిగా ఉన్నట్లు స్వయంగా ఆయన రాసిన చరిత్రే చెబుతోంది. ఊరికి సమీపంగా గల రవ్వలకొండలో ఆయన ఆవులను మేపుతూ కాలజ్ఞాన తత్వాలు రచించినట్లు ఆధారాలున్నాయి. బ్రహ్మంగారు తను రాసిన కాలజ్ఞాన తత్వాలను అచ్చమ్మ ఇంట్లో చింత చెట్టు కింద భద్రపరిచినట్లు చరిత్ర చెబుతోంది. తను జీవసమాధి అవుతున్న సమయంలో తన ప్రియ శిష్యుడైన సిద్దయ్య అడ్డుపడుతాడని భావించిన బ్రహ్మంగారు అతన్ని దేవదారు పూలకోసం బనగానపల్లెకు పంపినట్లుగా చరిత్ర చెబుతోంది.

బనగానపల్లెలోని వీధులను సింధూ నాగరికతకు అనుగుణంగా నిర్మించారనీ, వెడల్పయిన పురవీధులే దీనికాధారాలనీ ఇక్కడి ప్రజలు చెప్పుకుంటారు. ఏ నవాబుకూ లేని అధికారం బనగానపల్లె నవాబుకిచ్చారనీ, దాంతో ఆయన ఉరిశిక్షనూ అమలుచేసేవాడనీ ఇక్కడి వారు చెప్పుకుంటారు. దీనికి చిహ్నంగా రవ్వలకొండవద్దనున్న దర్గాలో ఉరికంబం నేటికీ కన్పిస్తోందిట. నవాబుల ఏలుబడిలో మతసామరస్యానికి ప్రతీకగా బనగానపల్లె ప్రసిద్ధిచెందింది. చరిత్ర తిరగేస్తే ఎప్పుడూ ఆ ప్రాంతంలో మత ఘర్షణలు చెలరేగినట్లు ఆధారాల్లేవు. బనగానపల్లె - నంద్యాల రోడ్డులో నేటికీ నవాబులు నిర్మించిన కోటలు శిథిలావస్థలో మనకు దర్శనమిస్తాయి.

పీర్లపండుగ బనగానపల్లెలో అత్యంత వైభవంగా జరుగుతుంది. కులమతాలకతీతంగా అన్ని వర్గాల ప్రజలూ అందులో పాల్గొంటారు. నవాబుల పాలనకు గుర్తుగా నేటికీ ఆ స్థానంలో బంగారు పీరు ఉంది. పురాతన కాలంలో చుట్టూ ఉన్న 64 గ్రామాలను కలుపుకుని బనగానపల్లె ఫిర్కాగా నవాబులు పాలన సాగించారు. ఆ కాలంలో వారి పాలనకు అది రాజధానిగా ఉండేది. బనగానపల్లెను సుమారు 350 సంవత్సరాలు నవాబులు పాలించారు. భారతదేశానికి స్వాతంత్ర్యమొచ్చిన సందర్భంగా తమ సంస్థానాన్ని విలీనం చేస్తూ... కోశాగారంలో ఉన్న సొమ్మునూ ప్రభుత్వానికప్పజెప్పిన ఘనత ఆ ఊరి నవాబులకుంది. మొదటి నవాబు గులాం ఆలీఖాన్ కాగా చివరివాడు ఆయన సంతతికి చెందిన మీరు ఫజుల్ ఆలీఖాన్‌గా చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం నాటి గరిమిరెడ్డి అచ్చమ్మ ఇల్లు నేటి బ్రహ్మంగారి మఠంగానూ, రవ్వలకొండ నవాబులు నిర్మించిన ఆస్థానంగానూ పేరుగాంచాయి.

❀



గడ్డిపెంచిన గజదొంగ

అది బ్రెజిల్‌లోని ఫోర్ట్ ఎలిజా పట్టణంలోని వాణిజ్య కేంద్రం. ఆగస్టు మొదటి వారంలో ఒక బ్యాంక్ దోపిడీ జరిగింది. దొంగలు మూడున్నర టన్నుల బరువుగల నోట్లను తస్కరించారు. కనీసం పది నుండి ఇరవైమంది వరకు వాటిని మోసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఉదంతం తీరు ఒకసినిమా తీయటానికి పనికి వచ్చేదిగా ఉంది. పాల్ సెరెగో అనే 40 ఏండ్ల దొంగల ముఠా నాయకుడు ఎంతో తెలివైన పథకం వేశాడు. ముందుగానే బ్యాంక్‌ను ఎంచుకున్నాడు. దాని పరిసరాలలో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. తాను పచ్చిక పెంచే పని చేస్తానని చుట్టుపట్లవారిని నమ్మించేందుకు గడ్డిమొలిపించాడు. బాగా పెంచాడు. ఎక్కడా నేల కనపడకుండా చూశాడు. తాముంటున్న ఇంటి నుండి బ్యాంక్‌కు మూడు నెలల్లో భూమికి నాలుగు మీటర్ల అడుగున 80 మీటర్ల సొరంగాన్ని తవ్వారు. ఒక మీటరు మందం ఉన్న సిమెంట్, ఇనుపగోడలను ఎలా తవ్వారో అంతుచిక్కక పోలీసులు తలలు పట్టుకున్నారు. ఇంతకు పచ్చగడ్డి ఎందుకు పెంచారో తెలిసే ఉంటుందిగా ! కింద నేలను తవ్వుతున్నట్లు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకండీ బాబూ ! బ్రెజిల్‌లో అతి పెద్ద బ్యాంక్ దోపిడీగా చరిత్రకెక్కిన ఈ ఉదంతంలో తొమ్మిదికోట్ల డాలర్ల విలువైన బ్రెజిల్ కరెన్సీ పోయింది. ప్రపంచంలో పెద్ద లూటీ 2003 మార్చినెలలో ఇరాక్‌లోని రిజర్వుబ్యాంక్‌లో జరగ్గా పదికోట్ల డాలర్లు పోయాయి. (అమెరికా చేస్తున్న లూటీతో పోల్చితే ఇది సముద్రంలో కాకిరెట్ట వంటిదన్నది వేరే విషయం) ఫోర్ట్‌ఎలిజాలో జరిగిన ఈ దోపిడీతో ఆ ప్రాంతం ఒక పర్యాటక స్థలంగా మారిపోయిందట. శనివారం రాత్రి అపహరించిన నోట్లను ఆదివారం ఉదయం అందరూ చూస్తుండగానే ఒక వ్యాన్‌లో వేసుకొని వెళ్లిపోయాడట.

- ఎంకెఆర్

సారీ... చివరి సారి

“పెళ్ళిలో అప్పగింతల సమయంలో పెళ్ళి కూతురు ఏడుస్తోంది. పెళ్ళికొడుకు నవ్వుతాడు ఎందుకురా ?” అనడిగాడు వీరేశం

“ఏముందిరా ఆమెకు అదే చివరి ఏడుపు. అతనికి అదే చివరి నవ్వు” చెప్పాడు రాజేశం.

- పెండెం జగదీశ్వర్

మనమెవరం ?

అవీ... ఇవీ

మనకు మనమే శత్రువులమై
గిరిగీతల తలపోతలు
సంఖ్యాబలాల అంకెల రిజర్వేషన్లలో..
మనం ఏ.బి.సి.డీలం కాదు
వేరు చేయబడ్డ పేదలం
భూమిదక్కని కూలీలం !

మల్టీనేషన్ ప్ర'వేటు'లో
గిలగిలా కొట్టుకుంటున్న తలలు
ప్రపంచీకరణ చెరలో...
మనం ఎస్టీ,ఎస్సీ,బీసీ ఓసీలం కాదు
నిరుద్యోగ సైన్యాలం
నిర్వేదపు దైన్యాలం !

ఆర్థిక ముట్టడిలో
ఆధిపత్యం ఎత్తుగడలు
సామ్రాజ్యవాద చిచ్చులో
మనం మైనారిటీలం, మెజారిటీలం కాదు
కుట్రకు బలౌతున్న జనులం
శత్రువు వలకు చిక్కిన పక్షులం !

అన్యాయాలను ఒదిలేసి
అభి'మతాలపై కత్తుల యుద్ధం
మత్తులో మునిగి రాజకీయ జిత్తుల్లో....
మనం హిందువులం, ముస్లిములం, క్రిస్టియన్లం కాదు
మానవులం, మనుష్యులం
దగాపడుతున్న సోదరులం !

వ్యవస్థ ప్రతిఫలాల అవస్థల లోగిళ్ళు
లోపదృష్టి పాలనలో అసమానతలగూళ్ళు
పెడత్రోవ పరిష్కారాల ప్రాంతీయ తగాదాల్లో...
మనం ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణీయులం కాదు
నిలువెత్తు తెలుగు వాళ్ళం
వేర్పాటు కోసం కాదు
'ఏర్పాటు' కోసం ఎదురు తిరిగేవాళ్ళం !
దోపిడీ విస్తరణలో
పీడన పెరుగుతున్న వేళ
మనం స్వదేశీయులం, విదేశీయులం కాదు
కార్మికులం, శ్రామికులం
మరో ప్రపంచ సాధకులం

కె. ఆనందాచారి

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

జీవపరిణామం ఆగిపోయిందా? కొనసాగుతోందా?

మానవునితో జీవపరిణామం ఆగిపోయిందా లేక కొనసాగుతోందా అంటే సమాధానం రెండు విధాలుగా వస్తుంది. కింది స్థాయి జీవులనుండి ఉన్నత జీవులకు పరిణామం నేటికీ కొనసాగుతోంది అనేది మొదటి సమాధానం. మానవుని తరువాత పరిణామం ముందుకు సాగడం ఆగిపోయినట్లే అన్నది రెండో సమాధానం.

జీవపరిణామం అన్నది ఒక నిరంతర క్రమం. పదార్థ నిత్య చలనంలో, నిత్య పరిణామంలో అది అంతర్భాగం. ఈ భూమి, గ్రహాలు కూడా పదార్థ చలనంలో భాగంగా ఏర్పడినవే. భూమి మీద నిర్జీవ పదార్థంనుండి ప్రాథమిక జీవులు, వాటినుండి ఉన్నత జీవులూ ఇలా పరిణామం చెంది నేడు ప్రపంచంలో మనకు కనిపిస్తున్న జీవవైవిధ్యం ఏర్పడింది. జీవులను ఎవరో సృష్టించలేదని, అవి ఎక్కడినుండో ఊడి పడలేదని పరిణామ క్రమంలో జీవజాలం ఏర్పడిందని ఛార్లెస్ డార్విన్ తన "ఆరిజిన్ ఆఫ్ స్పీషీస్" గ్రంథంలో సోదాహరణంగా వివరించాడు. ప్రకృతి వరణం (నేచురల్ సెలక్షన్) ద్వారా పరిణామం జరుగుతోందనీ ఆయన చెప్పాడు. తరువాత జీవశాస్త్రంలోనూ, ఇతర శాస్త్రాల్లోనూ జరిగిన అభివృద్ధి అంతా జీవపరిణామ సిద్ధాంతం నిజమేనని నిరూపించాయి.

ప్రకృతి వరణం (నేచురల్ సెలక్షన్) అనేది జీవులకూ, ప్రకృతికీ మధ్య జరిగే ఒక నిరంతర ఆదానప్రదాన ప్రక్రియ. జీవులూ, ప్రకృతీ ఉన్నంత వరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే ఉంటుంది. అంటే ఇప్పుడు భూమిమీద ప్రకృతి ఉంది, జీవులున్నాయి కనుక ప్రకృతి వరణం కొనసాగుతూనే ఉంటుంది. అంటే జీవపరిణామం జరుగుతూనే ఉంటుందన్నమాట. మరి జీవపరిణామాన్ని మనం గుర్తించగలమా, కింది స్థాయిజీవులనుండి ఉన్నత స్థాయి జీవులు అభివృద్ధి చెందడాన్ని మనం గమనించగలమా? అంటే సాధ్యమే అయితే అది చాలా కష్టంతో కూడిన పని. ఎందుకంటే జీవపరిణామం ఒక తరంనుండి మరో తరానికి జరిగేటప్పటికీ ఈ మార్పు చాలా చాలా నెమ్మదిగా జరుగుతుంది. ఒక్కోసారి కొన్ని తరాలవరకు ఎటువంటి మార్పు లేకుండా ఉండొచ్చు. అందువల్ల జీవపరిణామాన్ని కొన్ని సంవత్సరాల్లోనో, ఒక తరంలోనో, రెండు తరాల్లోనో గుర్తించి రికార్డు చేయడం కష్టంతోకూడిన పని. కాని అన్ని జీవుల్లోనూ- ఏకకణ జీవులు, బహుకణ జీవులూ, వృక్షాలు, జంతువులూ వెన్నెముకగల జీవులు, వెన్నెముక లేని జీవులూ అన్నిటిలోనూ- నీళ్లలో, నేలమీద, అడవుల్లో, ఎడారుల్లో, మంచుఖండాల్లో ఎక్కడైనా సరే జీవులున్న చోటల్లా పరిణామం మాత్రం జరిగిపోతూనే ఉంటుంది. ఇది తిరుగులేని ప్రకృతి ధర్మం.

మనిషి జీవపరిణామం ఫలితంగా ఆవిర్భవించిన వాడే కదా! జీవుల్లో ఉన్నతవర్గాలకు చెందిన కోతి జాతులనుండి మనిషి ఆవిర్భవించాడని పరిణామ వాదం చెబుతోంది. మరి మనిషి పరిణామం చెందుతున్నాడా, చెందుతుంటే మనిషినుండి కాలక్రమంలో ఎటువంటి జీవులు ఆవిర్భవిస్తాయి అన్న సందేహం కలగడం సహజం. ఇంకోమాటలో చెప్పాలంటే మనిషి భవిష్యత్తులో ఏ రూపంగా పరిణామం చెందుతాడు అని సందేహం వస్తుంది. కాని విషయమేమంటే మనిషి తరువాత ఇంకా ఉన్నతమైన జీవులు పరిణామం ద్వారా ఏర్పడే అవకాశం లేదు. కారణాల్లో ఒకటి, ఇతర జీవులు పరిణామం చెందవచ్చునేమోగాని మనిషికి మించి అంటే మనిషి తెలివితేటలకు మించి పరిణామం చెందే అవకాశం లేదు. ఎందుకంటే ఇప్పటికే తన విజ్ఞానం ద్వారా భూమిమీదగల అన్ని జీవులమీదా మనిషి ఆధిపత్యం సాధించాడు. వాటన్నిటినీ తన జీవనానికి ఆలంబనగా మలుచుకుంటున్న మనిషి కొన్ని లక్షల సంవత్సరాల తరువాతనైనా ఈ భూమ్మీద మరో జీవి తెలివితేటల్లో తనను మించి పోవడానికి అనుమతివ్వడు. ఇక రెండోది, మనిషే పరిణామం చెంది ఉన్నత రూపానికి రావచ్చుకదా! కాని మనిషి యొక్క భౌతిక పరిణామం ఏనాడో ఆగిపోయింది. ఆధునిక మానవుని ఆవిర్భావంతోనే మనిషి భౌతికంగా పరిణామం చెందడం ఆగిపోయింది. దీనికి కారణం కూడా మనిషికి సంక్రమించిన విజ్ఞానమే. ఎలాగంటారా?

జీవుల పరిణామం ప్రకృతి వరణం (నేచురల్ సెలక్షన్)ద్వారా జరుగుతుందనుకున్నాం కదా! జీవులు తాము నివసిస్తున్న పరిసరాలకు అనుగుణంగా శరీరంలో మార్పులు చేసుకుంటాయి. దీన్నే 'ఎడాప్టేషన్' అంటారు. ఆ విధంగా ప్రకృతికి ఎడాప్ట్ కావడం ద్వారా జీవుల శరీరాల్లో మార్పులు వస్తాయి. డార్విన్ దీన్ని మరో విధంగా చెప్పాడు. 'ప్రకృతిలో ప్రతి జీవీ విపరీతమైన సంఖ్యలో సంతానోత్పత్తి చేస్తుంది. ఆ సంతానమంతా బతికుంటే ఒక్క జీవి సంతానంతో ఈ భూమి అంతా నిండిపోతుంది. కాని అలా అన్నీ బతకవు. చాలా వరకు చనిపోతాయి. కాని ఏవి చనిపోతాయి, ఏవి బతుకుతాయి అన్నది ముఖ్యం. సాధారణంగా జీవుల సంతానంలో చాలా వైవిధ్యం ఉంటుంది. ఒకే తల్లికి పుట్టిన జీవుల్లో పొడవు, వెడల్పు, లావు, ఎత్తు, రంగులు, ఇలా చాలారకాల తేడాలుంటాయి. అంటే రకరకాల లక్షణాలున్న జీవులు పుడతాయన్నమాట. అయితే జీవుల్లో ఏ లక్షణాలైతే అవి నివసిస్తున్న ప్రకృతికి అనుగుణంగా ఉంటాయో అటువంటి జీవులు బతకడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. అలా అనుగుణంగా లేని జీవులు నశించిపోతాయి. దీన్నే డార్విన్ 'సర్వయివల్ ఆఫ్ ది ఫిటెస్ట్' అన్నాడు. ఈవిధంగా ప్రకృతితో ఎడాప్టేషన్ వల్ల జీవుల్లో వైవిధ్యం ఏర్పడుతుంది. ఉదాహరణకు: మామూలుగా ఎలుగుబంట్లకు చర్మం ఉంటుంది కాని ధ్రువ ఎలుగుబంట్లకు చర్మం కింద దట్టమైన కొవ్వు పొర ఉంటుంది. అంటే అక్కడి చలికి అనుగుణంగా దాని చర్మంలో మార్పు వచ్చిందన్నమాట. మామూలుగా సరీసృపాలకు నాలుగు కాళ్లుంటాయి కాని బొరియల్లో నివసించే పాములు వంటి వాటికి కాళ్లుండవు.



కాని మనిషి తన విజ్ఞానంతో, అంటే ఆలోచనా జ్ఞానంతో ప్రకృతిమీద విజయం సాధించాడు కనుక అతను ప్రకృతికి అనుగుణంగా మారడు. అంటే ఎడాప్ట్ కాడు. ప్రకృతినే తనకు అనుగుణంగా మార్చుకుంటున్నాడు. చలి ప్రదేశంలో ఎలుగుబంటి మాదిరిగా తను శరీరంలో కొవ్వు పొర ఏర్పడేదే, కాని చలి ప్రదేశంలో మనిషి తన పరిసరాలను తనకు అనుకూలంగా మార్చేస్తున్నాడు. రకరకాల దుస్తులు, పూర్వకాలంలో గుహలు, గుడిసెలు నేడు భవనాలు ఆ భవనాల్లో ఏసిలు, హీటర్లు ఇవన్నీ కూడా పరిసరాలను తనకు కావలసిన పద్ధతిలోకి మార్చుకోవడమే. అందువల్లనే విజ్ఞానవంతుడైన మానవునిలో భౌతికపరమైన పరిణామ క్రమం ఆగిపోయింది. ఎప్పటినుండి ఇలా అయిందంటే, శాస్త్రవేత్తలు చెబుతున్నది సుమారు 40,000 సంవత్సరాల క్రితం నుండి అని. నేటి ఆధునిక మానవుడైన క్రోమాన్యన్ మానవుడు తన పూర్వీకులనుండి 40,000 సంవత్సరాల క్రితం ఆవిర్భవించాడు. పనిముట్లు ఉపయోగించడం, నిప్పు ఉపయోగించడం ద్వారా అతను అప్పటినుండి ఇప్పటివరకు ప్రకృతిని తనకు అనుగుణంగా మార్చుకుంటున్నాడు. కనుక ఆనాటి నుండి మనిషి భౌతిక పరిణామం ఆగిపోయింది. అప్పటినుండి జరిగిన పరిణామం అంతా, మానవ సమాజంలో వస్తున్న మార్పులన్నీ మనిషి యొక్క సాంస్కృతిక పరిణామం మాత్రమే.

కొత్త పుస్తకాలు

'బోస్' బాటలో నడిచిన ఓ వైద్యుని జీవిత కథ

నేటి అత్యాధునిక కాలంలో వైద్యవృత్తిని ఒక సామాజిక భాధ్యతగా నెరిపిన డాక్టర్ల గురించి ఎవరైనా చెప్తుంటే చెవులురిక్కించి వింటుందీ తరం. అలాంటిది ఒక వ్యక్తి వైద్య వృత్తే తన జీవితంగా మలచుకుంటే ఇంకేముంది... ఒకసారి ఆ మహామనిషిని చూడాలనిపిస్తుంది. డబ్బులు గుంజడమే లక్ష్యంగా గల డాక్టర్లు చాలామంది నిత్యం మనకు తటస్తపడుతుంటారు. 'ఏం చేస్తాం' అని అనుకుని వదిలేస్తాం.



త్యాగధనుడు
కల్నల్ డాక్టర్ డి.ఎస్.రాజు
జీవిత కథ
వెల 50/-, పేజీలు 121
లక్ష్మీ-భువనేశ్వరి పబ్లికేషన్స్
6-3-570/1, రాక్ డేల్ కాంపౌండ్
సోమాజిగూడ, హైదరాబాద్

'మంచి డాక్టర్' అంటే ఎలా ఉంటాడు. "అచ్చం కల్నల్ డాక్టర్ డి.ఎస్.రాజులా..." ఠకీమని చెప్పాడు ధర్మారావు. ఆయన ఎవ్వర్నీ ఓ పట్టాన నమ్మడు. అలాంటిది ఆయనే "డా॥ డి.ఎస్.రాజు"లా అన్నారంటే... ఈ మాటనే ముందు అటు పది ఇటు పది, తరాల్ని ఆలోచించే అనుంటాడని అనుకుంటుండగానే ఓ బుక్కు తీసిచ్చాడు. అట్టమీద ఓ దృఢమైన, చక్కని రూపుగల వ్యక్తి ముఖచిత్రముంది. త్యాగధనుడు కల్నల్ డాక్టర్ డి.ఎస్. రాజు జీవిత కథ అని రాసుంది.

డిఎస్ రాజు, సుభాష్ చంద్రబోస్‌తో కలిసి పనిచేస్తూ సైనికులకు వైద్యాన్నందించిన నాటి జ్ఞాపకాలు ఈ పుస్తకంలో పరచబడ్డాయి. నిజంగా ఇదో అద్భుతమైన నవల. ఒక వ్యక్తి తన జీవిత చరిత్ర తనే చెప్పుకోవడమో... రాసుకోవడమో అయితే దానికి కొంత వెసులు బాటుంటుంది. కానీ వేరొక వ్యక్తి అందునా సుబాష్ చంద్రబోస్ కలిసి పనిచేసిన వ్యక్తి జీవితాన్ని గురించి రాయడం ఏమంత సులభం కాదు. ఒక పక్క జాతీయోద్యమ పరిస్థితులను సరిగా అంచనావేయడం... వాటికనుగుణంగా ఆ వ్యక్తి చిత్తాన్ని పాఠకులకందించడం పదునైన కత్తితో సాముచేయడం లాంటిది. అందుకే ఇలాంటి జీవిత కథలు తెలుగుసాహిత్యంలో తక్కువగా వచ్చాయి. చాలా కాలం తరువాత తెలుగు పాఠకులకిలాంటి జీవిత కథనందించిన రచయిత పి. చంద్రశేఖర్ ఆజాద్ అభినందనీయుడు.

నేడు రోజుకో వింత జబ్బులు ప్రస్ఫుటమౌతున్నాయి. వీటినెదుర్కొనే వ్యక్తి ఉండకపోతాడా? పుట్టకపోతాడా? అని నేటితరం ఆశాభావంతో ఉంది. దాన్ని మరింత పెంచుతుంది డాక్టర్ కల్నల్ డిఎస్ రాజు జీవిత కథ. ప్రజలను భయాందోళనకు గురిచేసిన క్షయలాంటి రోగాల్ని అధ్యయనం చేసి ప్రత్యేక వైద్యాన్ని పేదలకందించిన త్యాగధనుడు డిఎస్ రాజు.

అనేక యుద్ధాల్లో మృత్యువును సమీపించి తిరిగొచ్చిన ధైర్యశాలిగా... ప్రపంచయుద్ధాల సమయంలో భారతీయ సైనికులను తన వైద్యంతో బతికించిన వ్యక్తిగా ఈ పుస్తకంలో కనిపిస్తారు డాక్టర్ రాజు. అనేక ఆసుపత్రులను స్వయంగా స్థాపించి తనలోని సేవా తృష్ణని తీర్చుకున్న ఓ మహావ్యక్తి జీవిత కథ చక్కగా ఒదిగిందీ పుస్తకంలో.

ఇంకా ఈ పుస్తకంలో బోస్ గురించి ఇప్పటివరకూ సామాన్యపాఠకులకు తెలీని విషయాలున్నాయి. 1943 అక్టోబరు 21న నాటి సింగపూర్ "కేథ" సినిమాహాలు ప్రాంగణంలో జరిగిన సంఘటనను చదువుతుంటే సినిమాలో దృశ్యాలను చూస్తున్నంత ఉత్కంఠత కలుగుతుంది. పాఠకుల 'మనస్సు'కు దృశ్యాలనందించే స్థాయికి ఎదిగిందీ నవల. నాటి ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికేర్పాటు, అనంతర కాలాన్ని స్పృశించడంలో ఈ పుస్తకం ప్రతి పాఠకుణ్నీ ఆకట్టుకుంటుందనడంలో సందేహంలేదు. వైద్యవృత్తిని స్వీకరించే ప్రతీ డాక్టర్ చదవాల్సిన పుస్తకమిది.

సైదులు, ఐనాల

సంపూర్ణ సూర్యగ్రహణం



అజ్ఞానం, నిరక్షరాస్యత కారణంగా మన సమాజంలో నెలకొన్న మూఢనమ్మకాలు ఛాందస భావాలను రూపుమాపి, సామాన్య ప్రజల్లో శాస్త్రీయ దృష్టిని వికసింపజేసే లక్ష్యంతో భారత ప్రభుత్వాధ్వర్యంలోని సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్థ ఒక స్వతంత్ర వ్యవస్థగా 'విజ్ఞాన ప్రసార' విభాగాన్నేర్పరచింది. ఈ విభాగం ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రజల్లో శాస్త్రీయావగాహనను కలిగిస్తోంది. ఈ విభాగంతో 'అలకనంద' కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఆయా పుస్తకాలను తెలుగులో అనువదించి, ప్రచురిస్తున్నారు. అందులో భాగంగా వెలువడిందే ఈ 'సంపూర్ణ సూర్యగ్రహణం' అనే ఈ చిన్నపుస్తకం.



సంపూర్ణ సూర్యగ్రహణం
సందేహాలు-సమాధానాలు
అనువాదం :
పురాణపండ రంగనాథ్
వెల 20/-, పేజీలు 26
అలకనంద ప్రచురణలు
మేరిస్ స్టెల్లా కాలేజి
ఎదురుగా, విజయవాడ.

గ్రహణాల విషయంలో మనకనేక నమ్మకాలూ, మూఢవిశ్వాసాలూ ఉన్నాయి. సూర్య, చంద్ర గ్రహణాలు మనకు బాగా తెలుసు. అయితే సంపూర్ణ సూర్యగ్రహణం చాలా అరుదుగా వచ్చే ఒక ఖగోళ సంఘటన. అసలు గ్రహణం రోజు ఏమవుతుంది? సూర్యుడు ప్రదర్శించే విశేషాలేంటి? కాంతి కిరణాల విశేషాలు, విన్యాసాలు ఏమిటి ? సూర్యగ్రహణాన్ని చూడొచ్చా? ఆ సమయంలో భోజనాలు, స్నానాలు చేయొచ్చా ? గర్భిణీ స్త్రీలు, గర్భస్థశిశువులపై గ్రహణాల ప్రభావముంటుందా? ఇలాంటి అనేక సందేహాలకు సమాధానాలిందులో ఉన్నాయి.

కె.పి. అశోక్ కుమార్

సేమ్యా కొబ్బరి లడ్డూ

కావలసిన వస్తువులు

సేమ్యా	:	పావు కిలో
పంచదార	:	అర కిలో
జీడిపప్పు	:	50 గ్రాములు
నెయ్యి	:	వంద గ్రాములు
కొబ్బరి	:	పావు కిలో
ఏలకులు	:	పది
కిస్‌మిస్	:	పది గ్రాములు

తయారుచేసే విధానం

ముందుగా సేమ్యాను రెండు స్పూన్లు నెయ్యి వేసి దోరగా వేయించుకోవాలి. కొబ్బరి తురుము కోవాలి. కొబ్బరి కూడా కొంచెం నెయ్యి వేసి లైట్‌గా వేయించాలి. జీడిపప్పు, కిస్‌మిస్ కూడా నేతిలో వేయించుకోవాలి. యాలకులు పొడి చేసుకోవాలి. పంచదార మిక్సీలో మెత్తగా పిండిలాగా వేసుకోవాలి. అలాగే సేమ్యా కూడా మిక్సీలో మెత్తగా వేసుకోవాలి. వీటన్నిటినీ బాగా కలపాలి. మిగిలిన నెయ్యి వేడి చేసి దానిలో పోసి బాగా కలపాలి. చిన్న చిన్న లడ్డూలుగా చేసుకోవాలి. ఇవి చాలా త్వరగా అయిపోతాయి. చేసుకోవడం చాలా తేలిక. చాలా రుచిగా ఉంటాయి.

రుచి

గోధుమ పిండి బూరెలు

కావలసిన వస్తువులు

గోధుమ పిండి	:	ఒక కిలో
బెల్లం	:	ఒక కిలో
ఏలకులు	:	పది
నూనె	:	ఒక కిలో

తయారుచేసే విధానం

గోధుమ పిండిని శుభ్రంగా జల్లించుకోవాలి. బెల్లం తరిగి ఉంచుకోవాలి. ఏలకులు పొడి కొట్టుకోవాలి. బెల్లంలో నీళ్ళుపోసి పాకం పట్టుకోవాలి. పాకంలో ఏలకుల పొడి కలపాలి. తరువాత పిండిపోసి కలపాలి. పొయ్యి మీద నుంచి దించి పక్కన పెట్టుకోవాలి. నూనెపోసి పొయ్యి మీద పెట్టి కాగనివ్వాలి. నిమ్మకాయంత ఉండలు చేసి ప్లాస్టిక్ పేపర్ మీద బూరెలుగా చేసుకోవాలి. వీటిని కాగిన నూనెలో వేయాలి. ఇవి పొంగి మెత్తగా బాగుంటాయి. ఇవి వారం రోజులు నిల్వ ఉంటాయి.

పిల్లి తెలివి



చూటీ

అనగనగా ఒక పిల్లి వుంది. పాపం దానికి నా అన్న వారెవరూ లేరు. అనాథ అన్నమాట. పైగా అది చాలా పేదది. ఒక్కోసారి రోజంతా కష్టపడినా కూడా దాని బుజ్జి పొట్ట నిండదు. దాని దగ్గర మాంసం నరికే కత్తి మినహా మరేం లేవు. అదే దాని యావదాస్తి.

అయితేనేం పిల్లి మహా తెలివిగలది. తన తెలివితేటలతో అప్పుడప్పుడు మంచి విందు భోజనం చేస్తుంటుంది. ఆ రోజు అది చాలా సంతోషంగా వుంటుంది.

ఓసారి దానికి చేపలు తినాలనిపిస్తుంది. 'ఎలాగబ్బా?!' అని బాగా ఆలోచించింది. దానికి ఓ చక్కటి ఉపాయం తట్టింది. వెంటనే అడవిలోకి వెళ్లి మంచి వెదురుబొంగు నరుక్కొస్తుంది. దానితోనే మాంచి గేలాం చేస్తుంది. ఇంకేం ఎంచక్కా సముద్రపు ఒడ్డున కూర్చుని గేలాం వేస్తుంది. ఎలాగైనా సముద్రంలోకెల్లా పెద్ద చేపను పట్టాలన్నది దాని కోరిక. అందుకని చాలా ఓపిగ్గా ఎదురుచూడసాగింది.

అలా చూస్తుండగా... చూస్తుండగా... బాగా బరువైనదేదో గేలానికి తగిలింది. ఇంకేముంది? పెద్ద చేప పడిందనుకుంది. ఎంచక్కా ఆ చేపను తన కత్తితో ముక్కలు ముక్కలుగా నరికి చేపల వేపుడు, చేపల పులుసు, ఉప్పుచేపలు, ఎండు చేపలు... ఇలా రకరకాలుగా వండుకు తినాలనుకుంది. ఇంకా మిగిలితే నిల్వ వుంచుకోవాలని కూడా అనుకుంది. మరి రోగం వచ్చినా, వానొచ్చినా కాలు కదల్చకుండా ఎంచక్కా తినొచ్చుకదా. అదన్నమాట దాని ఉపాయం.

అందుకే తన బలమంతా ప్రయోగించి దాన్ని బయటకు లాగింది. తీరా చూస్తే ఏముంది? అది చేప కాదు. పే...ద్ద దుంగ. దాన్ని చూసి పాపం పిల్లి ఒక్క క్షణం పాటు నివ్వెరపోయింది. ఇదిలా వుండగా పక్కనున్న జంతువులన్నీ నవ్వి గేలిచేశాయి. ఇంక దానికి ఏం చేయాలో తోచలేదు. చేపలు తినాలన్న తన కోరిక తీరనందుకు అది ఎంతగానో బాధపడింది. మరో పిల్లి అయితే ఆ దుంగను అలా వదిలేసి వెళ్లిపోయేదేమో! కానీ ఈ పిల్లి చాలా తెలివిగలదికదా.

బాగా ఆలోచించింది. 'దీన్ని ఏం చేస్తే మనకు ఉపయోగం?' అని తీవ్రంగా ఆలోచించింది. అప్పుడు దానికి ఓ ఐడియా వచ్చింది. వెంటనే కత్తిని బయటికి తీసింది. దానికి బాగా పదును పెట్టింది. ఇంక ఓపిగ్గా కూర్చుని దుంగను కత్తితో రెండు ముక్కలు చేసింది. ఒక్కో ముక్కను మళ్లీ రెండేసి ముక్కలుగా నరికింది. ఇలా నరుకుతూ.... నరుకుతూ వుంది. పిల్లి చేస్తున్న పనిని చూసి దారినపోయే జంతువులు, పక్షులు నవ్వుకున్నాయి. చేపలు తినాలన్న కోరిక తీరకపోయేసరికి దానికి పిచ్చి పట్టిందనుకున్నాయి.

పిల్లి మాత్రం చివరికి ఆ చెక్కముక్కలతో ఒక ముచ్చటైన పడవ చేసింది. దాన్ని మెల్లగా సముద్రం ఒడ్డుకు లాక్కెళ్లింది. అందులో కూర్చుని ఎంచక్కా గేలం వేసింది. కాసేపటికే బోలెడన్ని పెద్ద పెద్ద చేపలను పట్టుకుంది. వాటితో తను నివాసముండే గుహ దగ్గరకు చేరింది. ఎంచక్కా తను కోరుకున్నట్టుగానే చేపలను రకరకాలుగా వండుకుని తింది.

ఇంక ఆ పడవలో రోజూ అలాగే చేపల వేటకు వెళ్లసాగింది. అంతేకాదు వాటిని అమ్మి సొమ్ము చేసుకోసాగింది. అలా మెల్లగా ధనవంతురాలైంది. సొంతగా ఇల్లు కట్టుకుంది. చేపల వ్యాపారం పెట్టుకుంది. అదంతా తన ఒక్కదానివల్ల కాక పనివాళ్లను ఏర్పాటుచేసుకుంది. ఇంట్లో నౌకర్లను పెట్టుకుంది.

అది చూసి మిగతా జంతువులన్నీ పిల్లిని తెగ మెచ్చుకున్నాయి. అనుకున్నది జరగలేదని, దొరకలేదని కుంగిపోకుండా తెలివితేటలతో ముందుకు నడిచిన పిల్లిని చూసి నేర్చుకోమని తమ బిడ్డలకూ చెప్పాయి.